

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 23: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, రోడ్లు భవనాలు, డ్వామా, గృహ నిర్మాణం, విద్యుత్, పశు సంవర్ధక, మత్స్య, ఉద్యాన, విద్యా, వైద్యం, సమగ్రశిశు సంక్షేమం, గిరిజనాభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖలపై స్టాండింగ్ కమిటీలో చర్చిస్తారని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.



పెన్నా జలాల్లో కుంకుమను నిమజ్జనం చేస్తున్న భక్తులు

పెన్నా తీరాన భక్తిపారవశ్యం

పెన్నా ఒడ్డున వెలసిన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా లక్ష కుంకుమార్చన జరిగింది. తొలుత వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాసపూర్వక విశేష ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం బద్వేలుకు చెందిన బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులు కామాక్షిదేవికి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో నిర్మాల్య కుంకుమను భక్తులు ర్యాలీగా తరలివెళ్ళి పెన్నా జలాల్లో నిమజ్జనం చేశారు. దీంతో నదీ జలాలు ఎరుపెక్కాయి. ఆ తరువాత భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

\- సంగం

జైల్ సూపరింటెండెంట్ బదిలీ

నెల్లూరు(క్రైం): జిల్లాలోని వెంకటాచలం మండలం చెముడుగుంటలో గల జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కే రాజేశ్వరరావు కడప సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరులోని ఏపీస్టార్స్ ప్రిన్సిపాల్ ఎస్ రాజారావును ప్రభుత్వం నియమించింది. కడప సెంట్రల్ జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఐఎస్‌హెచ్ ప్రకాష్‌ను నెల్లూరులోని ఏపీ స్టార్స్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ జైళ్లశాఖ డీఐజీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదేళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. 2014-19 మధ్య టీడీపీ హయాంలో ఎన్టీఆర్ ఇళ్ల లబ్ధిదారులకు ప్రస్తు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అప్పట్లో బకాయి పడిన బిల్లులను చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించారు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా నుంచి ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. జిల్లాలో 29,861 ఇళ్ల లబ్ధిదారులకు సుమారు రూ.40.62 కోట్ల బకాయిలు అందనున్నాయి.



సంగం : బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా ఆగిన ఇంటి ముందు పట్టతో ఏర్పాటు చేసుకున్న గుడిసె

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- నాటి ఎన్టీఆర్ గృహాలకు అందని బిల్లులు
- జిల్లాలో రూ.40.62 కోట్ల వరకు బకాయి
- ఆరా తీస్తున్న కూటమి ప్రభుత్వం
- జాబితా తయారీలో యంత్రాంగం సన్నద్ధం

నెల్లూరు (జడ్పీ)/సంగం, ఆగస్టు 23 : జిల్లాలో పేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం (2014-19) ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస యోజనా పథకంలో 2016-17, 2017-18, 2018-19, 2019-20 నాలుగు విడతలుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 39,500 పక్కా గృహాలను మంజూరు చేసింది. ఎన్టీఆర్ పక్కా గృహాలకు రూ.1.5 లక్షలు, పీఎంఏవై పథకంలో రూ.2 లక్షలు చొప్పున కేటాయించారు. దీంతో సొంతింటి కల నెరవేర్చుకునేందుకు లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణాలు చేపట్టారు. మొదటి విడతలో చేపట్టిన 12,500 గృహాల్లో సుమారు 11,228 పూర్తయ్యాయి. వీటిని బిల్లులు పూర్తిగా చెల్లించారు. ఆ తరువాత రెండు, మూడు, నాల్గవ విడతలో చేపట్టిన పక్కా గృహాల్లో కొన్ని పూర్తవగా, కొన్ని శ్లాబ్‌లెవల్, మరికొన్ని రూఫ్‌లెవల్, ఇంకొన్ని బేస్‌మెంట్ తదితర దశల్లో సుమారు 29,861 పక్కా గృహాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇందుకుగాను సుమారు రూ.40.62 కోట్ల బకాయిలు లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉంది.

● లబ్ధిదారులను పట్టించుకోని వైసీపీ

ఏ ప్రభుత్వం అమలు చేసిన పథకాలైనా ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. కానీ గత వైసీపీ సర్కారు మాత్రం ఇందుకు భిన్నంగా పథకాలన్నింటినీ నిర్ధాక్షిణ్యంగా ఆపేసింది. ఆ కోవలోదే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కూడా. 2019, ఎన్నికలు సమీపించేసరికి అనేక ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయాయి. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అప్పటికే వివిధ దశల్లో ఉన్న ఎన్టీఆర్ గృహాల గురించి పట్టించుకోలేదు. రకరకాల కారణాలు చూపుతూ పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. దీంతో ఐదేళ్లుగా లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు.

నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న గృహాలు

నియోజకవర్గం	గృహాలు	బకాయి (రూ.కోట్లలో)
ఆత్మకూరు	5,636	7.52
కందుకూరు	3,621	4.33
కావలి	5,279	6.33
కోవూరు	4,192	5.43
నెల్లూరు రూరల్	1,307	1.80
సర్వేపల్లి	5,865	8.94
ఉదయగిరి	3,961	6.28
మొత్తం	29,861	40.62

● కూటమి ప్రభుత్వం తీపి కబురు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం, ఆ వెంటనే ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులకు బకాయి బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని గృహనిర్మాణ శాఖ అధికారులు జాబితాలను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసి ఆత్మకూరు, కందుకూరు, కావలి, కోవూరు, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో నిలిచిన ఎన్టీఆర్ గృహాలను సచివాలయాల వారీగా ఏ స్థాయిలో ఉన్నాయన్న జాబితాను సిద్ధం చేయనున్నారు. వచ్చేనెల 10వ తేదీ నాటికి జాబితా సిద్ధం చేసి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. త్వరలో బకాయిలు వస్తాయని తెలియడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

ఎవరు.. ఎక్కడ!?

పరిపాలనలో కీలకమైన జిల్లా అధికారుల బదిలీలపై ఉత్కంఠ వీడలేదు. గత రెండు నెలలుగా చర్చలు జరుగుతున్నా ఓ కొలిక్కి రావడం లేదు. ఏ శాఖకు ఎవరు జిల్లాస్థాయి అధికారి అనేది ఇంతవరకు ఫైనల్ కాలేదు. వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. దీంతో పాలనపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

- కొలిక్కిరాని అధికారుల బదిలీల ప్రక్రియ
- పలుమార్లు చర్చల్లో కుదరని ఏకాభిప్రాయం
- వైసీపీతో అంటకాగిన అధికారులతోనే పేచీ
- మాకెందుకులేనన్న ధోరణిలో ప్రస్తుత అధికారులు
- నాయకుల సిఫార్సు లేఖల కోసం బారులు



కోరుకున్న చోటుకు నేను బదిలీ అయ్యేలా చూడు స్వామీ..!

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతమున్న అధికారులు ఎలాగో తమను బదిలీ చేస్తారన్న నిర్ణయానికి వచ్చి పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదు. వీరంతా వేరే ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. దీంతో ఆయా శాఖల్లో ఫైళ్లు కదలడం లేదు. ఆఖరుకు పత్రికల్లో వస్తున్న ప్రజాసమస్యలపై వివరణ ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా పట్టించుకునే తీరిక వారికి లేకుండా పోయింది. కొంతమంది అధికారుల్లో ఇంకా వైసీపీ తాలూకా నిర్లక్ష్యం వీడడంలేదు. అప్పట్లో పని చేయకపోయినా ఎవరూ పట్టించుకునేవారు కాదు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం గట్టిగా ఉండటంతో ఈ అధికారుల తీరు ఇబ్బందిగా మారుతోంది. సాధారణ బదిలీల కన్నా ముందుగానే జిల్లా అధికారుల బదిలీలు పూర్తి చేయాలని భావించినా సాధ్యపడలేదు. దీంతో ఉద్యోగుల సాధారణ బదిలీలు పూర్తయిన వెంటనే జిల్లా అధికారుల బదిలీలు కూడా పూర్తి చేసి పాలనను గాడిలో పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే జిల్లాలో ఏ శాఖకు ఎవరిని నియమించాలన్నదానిపై ఎమ్మెల్యేల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు.

● ఉద్యోగుల్లో బదిలీల సందడి

సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో అన్ని శాఖల్లో ప్రస్తుతం బదిలీల ఫీవర్ కొనసాగుతోంది. నచ్చిన చోటకు వెళ్లేందు కు కొందరు ప్రయత్నాలు సాగిస్తుంటే, మరికొందరు ఉన్న చోటును కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఐదేళ్లు ఒకేచోట పని చేసిన వారికి తప్పనిసరి బదిలీ కావడంతో ఆ ఖాళీలన్నీ ఆయా శాఖలు ప్రకటించాయి. ఈ స్థానాలకు వెళ్లేందుకు ఆసక్తి కలిగిన వారు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను తెచ్చుకుంటు న్నారు. అదే సమయంలో పరిపాలన సౌలభ్యం కింద జీరో సర్వీసు ఉద్యోగులను కూడా బ దిలీ చేసే అవకాశం ఉంది. దీంతో వైసీపీ ప్రభుత్వంలో వివక్షకు గురైన ఉద్యోగులు కీలకస్థానాల్లో తమకు అవకాశం కల్పించాలంటూ ఎమ్మెల్యేలను కోరుతున్నారు. సిఫారసు లేఖల కోసం వచ్చే ఉద్యోగులతో ఎమ్మెల్యేల కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.

● జిల్లాస్థాయి పోస్టులకు పైరవీలు

ప్రభుత్వం మారగానే జిల్లాస్థాయి పోస్టులకు పైరవీలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న అధికారులు జిల్లాలో పోస్టులు సంపాదించుకునేందుకు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. సందట్లో సడేమియాలా వైసీపీ ప్రభుత్వంలో కీలక పోస్టులు అనుభవించడంతోపాటు వైసీపీ నేతలతో అంటకాగి తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు అధికారులు కూడా జిల్లాలో తిష్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒంగోలు జడ్పీ సీఈవోగా పనిచేసి వైసీపీతో అంటకాగిన ఓ అధికారి జిల్లాలో డీపీవో పోస్టుకు రెకమండ్ చేయించుకోవడమే ఇందుకు ఉదాహరణ. ఆర్డీవో, డీఎస్పీ పోస్టులకూ పలువురు వివాదాస్పద అధికారులు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇలాంటి అధికారులంతా ఎమ్మెల్యేల మద్దతు సంపాదించుకున్నారు. దాదాపుగా జిల్లాస్థాయి పోస్టులకు అధికారుల పేర్లు ఎమ్మెల్యేల సమావేశంలో చర్చకు వచ్చాయి. ఇప్పటికి రెండు దఫాలుగా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా సమావేశమై జిల్లాస్థాయి అధికారుల పోస్టులపై చర్చించారు. కొన్ని కీలక పోస్టుల విషయంలో వారి మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డీపీవో, డీఆర్‌డీఏ పీడీ, జడ్పీ సీఈవో, డ్వామా పీడీ, నుడా వీసీ, ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. త్వరలో మరోసారి ఎమ్మెల్యేలంతా పోస్టులపై చర్చించనున్నారు.

మన ఊరు.. మన బాధ్యత

- గ్రామసభల్లో తీర్మానించుకున్న సర్పంచులు, ప్రజలు
- 722 పంచాయతీల్లో గ్రామసభలు
- స్వయంగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నెల్లూరు (ఆంధ్ర జ్యోతి), ఆగస్టు 23 : 'మన ఊరును అభివృద్ధి చేసుకో వడం మన బాధ్యత. అందుకు అందరం కలిసి కట్టుగా పనిచేద్దాం.' అంటూ సర్పంచులు, గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కునారిల్లిన గ్రామపాలనను తిరిగి గాడిలో పెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూనుకుంది. గ్రామల అభివృద్ధే లక్ష్యంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా 722 పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. ఎమ్మెల్యేల నుంచి వార్డు సభ్యుడి దాకా, కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగి వరకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామసభల్లో పాల్గొన్నారు. సర్పంచుల అధ్యక్ష తన జరిగిన ఈ సభల్లో ఆయా గ్రామాల అభి వృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చిం చారు. గ్రామపరిధిలో ఉన్న సమస్యలను ఎలా పరిష్కరించాలన్న దానిపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. వీటిని పంచాయతీ పాలక వర్గంలో తీర్మానించి అమలు చేస్తామని సర్పం చులు ప్రకటించారు. చాలా పంచాయతీల్లో గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని, తమ విధులు, నిధులు లాగేసుకున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై పలు పంచాయతీల్లో గ్రామస్థులు కార్యదర్శులను నిలదీశారు. నెల్లూరు రూరల్ మం డలం కాకుపల్లి పంచాయతీలో జరిగిన గ్రామసభకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరి ధర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. సర్వేపల్లి నియోజక వర్గం మనుబోలు మండలంలోని పిడూరు, వెంకటాచలం మండలంలోని కురిచర్లపాడు, పొదలకూరు మండలంలోని అయ్యవారిపాళెంలలో సభలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పాల్గొ న్నారు. కోవూరులో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరు, బోగోలు మండలంలోని జువ్వలదిన్నె గ్రామసభలకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి విచ్చేశారు. కందుకూరు మండలం కొండముడుసుపాళెం, ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామంలో జరిగిన సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆత్మకూరు మండలం నువ్వురుపాడులో కలెక్టర్ ఆనంద్, జడ్పీ సీఈఓ కన్నమనాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్న చోట ఆయా గ్రామస్థులు వారి సమస్యలను వీరి దృష్టికి తీసుకొచ్చారు. పెద్ద సంఖ్యలో అర్జీలను అందచేశారు.



నెల్లూరు రూరల్ : కాకుపల్లిలో ఎంపీ వేమిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

● స్వర్ణ గ్రామంగా మార్చడమే లక్ష్యం : కలెక్టర్

ఆత్మకూరు: గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన మార్పులు తేలవాలన్నదే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో ఒకే రోజు 772 గ్రామసభలు నిర్వహించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆత్మకూరు మండలం నువ్వూరుపాడులో జరిగిన సభలో ప్రజల నుంచి పలు సమస్యలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని స్వర్ణగ్రామంగా మార్చాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఒకేరోజు 772 సభలు నిర్వహించి, ప్రజల నుంచి సమస్యల తెలుసుకున్నట్లు తెలిపారు. మంచినీటి కొళాయిలు, మరుగుదొడ్లు, అంతర్గత రహదారులు, వ్యర్థాల నియంత్రణ, వాటర్ ట్యాంకుల ఏర్పాటు తదితర కనీస అవసరాలు తీర్చడంతోపాటు సభల్లో ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకం పనులకు ఉదయమే 6 గంటల్లోపు వచ్చి 11 గంటల మధ్య ముగించుకెళ్లాలని సూచించారు.



ఉలవపాడులో జరిగిన గ్రామసభలో అధికారులకు సమంగా హాజరైన స్థానికులు

వైద్యుల భద్రతకు ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (వైద్యం) : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఉదంతం నేపథ్యంలో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యాధికారులు స్పందించారు. విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించటంతోపాటు వారికి కల్పించాల్సిన వసతులను పరిశీలించారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదితోపాటు రెస్ట్‌రూమ్, ప్రత్యేక బాత్‌రూమ్‌ల ఏర్పాటును పరిశీలించారు. మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించేందుకు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి పాల్గొన్నారు.

ఈసారి కోడూరు కబ్జా

పంట కాలువ ఆక్రమించి రోడ్డు నిర్మాణం ● అల్లీపురంలో రియల్టర్ల బరితెగింపు

నెల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఉత్తర్వులు అంటే లెక్కలేదు.. హైకోర్టు ఆదేశాలంటే భయమూ లేదు.. చట్టం వారి చుట్టం అన్నట్లుగా తయారైంది అల్లీపురంలోని అనధికార వివాదాస్పద లేఅవుట్లో పరిస్థితి. ఆ లేఅవుట్ పనులు మొదలైన రోజు నుంచి విమర్శలు వెల్లువెత్తుతుండగా, ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఓ మాజీ మంత్రి సోదరుడు, అనుచరులకు సంబంధించిన లేఅవుట్ కావడంతో నాడు ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఏకంగా పంట కాలువలను కుదించి ఆరెకరాల కాలువ స్థలాన్ని కబ్జా చేసి రోడ్డు వేసినా పట్టించుకున్న నాథుడు లేడు. ఈ వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే బురద కాలువ, పల్లపు కాలువలను ఆక్రమించి రోడ్లు నిర్మించగా తాజాగా కోడూరు కాలువను కూడా ఆక్రమించి ఏకంగా బీటీ రోడ్డు వేశారు. సుమారు కిలోమీటర్ మేర లేఅవుట్ పరిధి మొత్తం కోడూరు కాలువపై రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డునే లేఅవుట్‌లో రోడ్డుగా చూపిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. కోడూరు కాలువ స్థలం సుమారు మూడెకరాలు కబ్జాకు గురైంది. ప్రసుత్తం అక్కడ విక్రయిస్తున్న విలువ ప్రకారం చూసుకుంటే ఈ కబ్జాకు గురైన కాలువ స్థలం విలువ సుమారు రూ.25 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇప్పటికే ఆరెకరాలకుపైగా ఆక్రమణ జరగ్గా దాని విలువ రూ.50 కోట్లకుపైగానే ఉంటుందని అంచనా. మొత్తంగా సుమారు రూ.75 కోట్ల విలువైన ప్రజా ఆస్తులను కబ్జా చేసి అక్రమార్కులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా ఈ లేఅవుట్‌ను అనధికార జాబితాలో చేర్చిన కార్పొరేషన్ అధికారులు.. అక్కడ ఆక్రమణల జోలికి మాత్రం వెళ్లకపోవడం గమనార్హం.

● హైకోర్టు ఆదేశించినా...

అల్లీపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 255, 88-3, 88-2ఈ1, 88-1, 89/38, 112/3-బీ, 113/3-బీ, 113/3-ఏ2, 87, 67లలో కోడూరు కాలువ, బురద కాలువ, పల్లపు కాలువలు వెళుతున్నాయి. ఈ చుట్టుపక్కల భూములను లేఅవుట్‌గా మార్చిన కొందరు వ్యక్తులు ఈ కాలువ పోరంబోకు, కాలువ బండ్‌లను ఆక్రమించారు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టి, 2022, ఆగస్టు 13వ తేదీన అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబుకు కాలువల ఆక్రమణపై ఫిర్యాదు చేశా రు. అధికారుల నుంచి చలనం లేకపోవడంతో అల్లీపురం స్థానికులైన మేకల అనీల్‌కుమార్‌తోపాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఇక్కడా ఆక్రమణలు తొలగించకుండానే అధికారులు తొలగించినట్లు హైకోర్టును తప్పుదారి పట్టించారు. మరోసారి పిటిషనర్లు కోర్టు మెట్లు ఎక్కడంతో ఈ దఫా పిటిషనర్ సమక్షంలో సర్వే చేసి, నాలుగు నెలల్లో ఆక్రమణలు తొలగించి నివేదించాలని హైకోర్టు గతేడాది మే నెలలో ఆదేశించింది. కానీ ఇప్పటికీ ఆక్రమణలు తొలగించలేదు. వైసీపీ పాలనలో అరాచకం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఇదొక నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. కాగా కాలువల ఆక్రమణపై ఇరిగేషన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా గతంలో ఆక్రమణల తొలగింపునకు నెల్లూరు ఆర్డీవో నోటీసు ఇచ్చారని, అయితే అది జరగలేదని, తర్వాత మరో తేదీ చెబుతామని ఆర్డీవో చెప్పారని తెలిపారు. ఇప్పుడు కోడూరు కాలువపై రోడ్డుకు తాము అనుమతులు ఇవ్వలేదని, అసలు రోడ్డు వేసిన విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



కోడూరు కాలువను ఆక్రమించి వేసిన బీటీ రోడ్డు

సింహ వాహనంపై వెంకయ్య చిద్విలాసం

వెంకటాచలం : వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం ఉదయం స్వామివారు సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గరుడ వాహనంపై కొలువుదీరిన వెంకయ్య స్వామి గ్రామంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామి వారికి స్వాగతం పలకడానికి మహిళలు తమ వాకిళ్లను రంగవల్లు లతో తీర్చిదిద్దారు. గొలగమూడి వాసులు స్వామి వారి ఊరేగింపు తమ వాకిలి ముందు ఒక్కక్షణం ఆగినా చాలన్నట్లుగా ఉద్వేగంతో కర్పూర హారతులు పట్టి మురిసిపోయారు.

● ఆరాధనోత్సవాల్లో చివరి రోజు శనివారం ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. కాగా, ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.



ఆంధ్రకేసరి బహుముఖ ప్రజ్ఞాశాలి : జేసీ

● కలెక్టరేట్‌లో ఘన నివాళి


ప్రకాశం పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి అని జాయిం ట్ కలెక్టర్ కార్తీక్ కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో డీఆర్వో లవన్న, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లా సహకారశాఖాధికారి కార్యాలయంలో ప్రకాశం పంతులు విగ్రహానికి డీసీవో గురప్ప పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రకాశంపంతులు అత్యంత ప్రజ్ఞావంతుడని, న్యాయకోవిదుడని కొనియాడారు.

'వాత్సల్య'కు రూ.5 లక్షల విరాళం


చెక్కు ఇస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 23 : నెల్లూరులోని జన హిత-వాత్సల్య అనాథ శరణాల యానికి నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం రూ. 5 లక్షల విరాళాన్ని అంద చేశారు. వారి నివాసంలో వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు విరాళం చెక్కును అందచేశారు. సాంబశివరావు మాట్లా డుతూ 36 ఏళ్లుగా వాత్సల్య సంస్థకు వేమిరెడ్డి కుటుంబం సహాయ సహకారాలు అంది స్తోందని చెప్పారు.

ఏమా ఫైళ్లు.. ఎత్తుకెళ్లింది ఎవరు!?

● వెంకటాచలం ఎమ్పీడీవో కార్యాలయంలో ఫైళ్ల మాయం

● వైసీపీ నేతల పనేనంటున్న కూటమి నాయకులు


బైక్‌పై ఫైళ్లను తరలిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి

వెంకటాచలం, ఆగస్టు 23 : వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయంలో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు గల్లంతు అయినట్లు సమాచారం. కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిలో ఒకరు రెండ్రోజుల క్రితం రూర్బన్ పథకం లేదా జాతీయ ఉపాధి హామీ పథకం ఈ రెండింట్లో ఏదో ఒక పథకానికి సంబంధించిన ఫైళ్లను పెద్ద సంచిలో పెట్టుకొని బయటకు తీసుకెళి మరోవ్యక్తికి ఇస్తుండగా కొందరు గమనించారు. దీంతో ఆ ఫైళ్లు తీసుకెళ్లే వ్యక్తి హడావుడిగా మోటర్ సైకిల్‌పై పెట్టుకుని ఉడాయించాడు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండదండలతో వెంకటాచలం మండలంలో భారీగా అవినీతి, దోపిడీ, అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రూర్బన్ పథకం కింద పనులు చేయకుండానే చేసినట్లు, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన సిమెంట్ రోడ్లను వైసీపీ నాయకులు తాము వేసినట్టుగా నిధులు దుర్వినియోగం చేశారని, అలాగే ఉపాధి హామీ పథకం కింద పనులు చేయకనే రూ.కోట్లాది రుపాయలు స్వాహా చేయడంతోపాటు భారీ అవినీతి, అక్రమాలు, దోపిడీకి పాల్పడ్డారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారి అవినీతి, దోపిడీ, అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతోనే ఫైళ్లు మాయం చేసి ఉంటారని సమాచారం. ఈ వ్యవహారంపై ఎంపీడీవో ముజీబున్నీసాను వివరణ కోరగా తమ కార్యాలయం నుంచి ఎలాంటి ఫైళ్లు మాయం కాలేదని, మరీ ముఖ్యంగా రూరన్ పథకానికి సంబంధించిన ఫైళ్లు తన ఆధీనంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

దాహం కోసం వెళ్లి బావిలో చిక్కుకున్న దుప్పి




మర్రిపాడు, ఆగస్టు 23: పడమటినాయుడుపల్లి పొలాల్లో నీటి కోసం వచ్చిన దుప్పి బావిలోకి దిగి చిక్కు కుంది. రైతులు గుర్తించి దాన్ని బయటకు తీసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు వచ్చి దుప్పిని రక్షించి అడవిలో విడిచిపెట్టారు.

రైలు కట్టపై మృతదేహం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 23 : నెల్లూరులోని కొండాయపాళెం గేటు సమీపంలో రైలు కట్టపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచార మి చ్చారు. రైల్వే ఎస్‌ఐ జీ మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిం చారు. 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై మెరూన్ రంగు మీద బులుగు రంగు చెక్స్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బులుగు రంగుపై తెలుపు చెక్స్ లుంగీ ఉన్నాయని తెలిపారు. ఇతర ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు భావిస్తున్నారు.

● నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో గల ప్రశాంతి నగర్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. చంద్రయ్య అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై బులుగు రంగు గళ్ల లుంగి, నలుపు, బులుగు రంగు గళ్ళ చొక్కా ఉన్నాయి.

చెట్టును ఢీకొన్న కారు


ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యాధికారి నవీన్‌కుమార్

చేజర్ల, ఆగస్టు 23: ఆదురుపల్లి- కలువాయి ప్రధాన రహదారిలోని గోపవరం సమీపంలో వెళుతున్న ఓ కారు అదుపుతప్పి చెట్టుకు గుద్దుకుంది. ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అదే సమయంలో అటుగా 104వాహనంలో వెళుతున్న చిత్తలూరు పీఏహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌కుమార్ అక్కడి వెళ్లి బాధితులను పరిశీలించారు. గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందజేసి 108వాహనంలో వైద్యశాలకు తరలించారు.

బైక్ పైనుంచి పడి
ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 23: శకునాలపల్లి సమీపంలో శుక్రవారం మోటార్‌బైక్‌పై నుంచి పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.ఆదిలక్ష్మి జారి పడి తలకు తీవ్ర గాయపడింది. పాఠశాల విధులు ముగిసిన అనంతరం స్వగ్రామమైన కడప జిల్లా రసాయిపేటకు వెళ్లేందుకు మోటార్‌బైక్‌పై యర్రబల్లిగడ్డ సెంటర్‌కు వస్తుంది. ఈ తరుణంలో శకునాపల్లి గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గమనించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

● ఆటో, మోటార్ బైక్ ఢీకొని..

సున్నవారిచింతల గ్రామ సమీపంలో ఆటో, మోటార్‌బైక్ ఢీకొన్న సంఘటనలో గుడినరవ గ్రామానికి చెందిన బక్కా సుజాత గాయపడింది. ఉదయగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా గండిపాళెం నుంచి దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామానికి వెళుతున్న ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడిన సుజాతను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6867
వెండి కిలో ధర	రూ. 87,000
వెండి ఒక గ్రాము	రూ. 90.00

అంబుడాన్స్

● అంబులెన్స్‌ల దోపిడీ
● రోగుల అవసరాన్ని బట్టి అక్రమ వసూళ్లు
● అమలుకాని అధికారిక ధరలు
● జీజీహెచ్ వద్ద అధికారపార్టీ వర్గాల దందా
● సహకరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది
● పేద, మధ్య తరగతిపై ఆర్థిక భారం

● ఇందుకూరుపేటకు చెందిన ఓ వ్యక్తి ఆరోగ్యం విషమించటంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం చెన్నైకి తరలించాలని భావించారు. టెంపో అంబులెన్స్ మాట్లాడగా రూ.15 వేలు డిమాండ్ చేశారు. కొంచెమైనా తగ్గించాలని అంబులెన్స్ నిర్వాహకులను వేడుకోగా వారు కనికరించకపోవ డంతో అడిగినంత చెల్లించక తప్ప లేదు.

● విడవలూరు మండలానికి చెందిన లక్ష్మణరావు అనే రోగి నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. మెరుగైన వైద్యం కోసం మినీవ్యాన్ అంబు లెన్స్‌లో నారాయణ ఆసుపత్రికి తరలలించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న ప్రైవేట్ అంబులెన్స్‌ను సంప్రదించగా రూ.10వేలు డిమాండ్ చేశారు.

ఇలా ఒకటి కాదు రెండు కాదు అంబులెన్స్‌ల అక్రమదందా జిల్లాలో విచ్చలవిడిగా సాగుతోంది. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో ఒక క్రమ పద్ధతిలో ఈ దోపిడీని సాగిస్తున్నారు.



నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : ప్రమాదాలు జరిగినప్పుడు, తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు బాధితులను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు, ఒక ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి రోగులను తరలిం చేందుకు అంబులెన్సులు ఎంతో అవసరం. ఇందుకు దూరాన్ని బట్టి చార్జీ వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని చాలా మంది అంబులెన్స్ ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. రోగుల అవసరాన్ని, అత్యయిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక మొత్తం నగదు డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే వాహనం ససేమిరా కదల దంటూ కర్కశంగా చెప్పేస్తున్నారు. మరో అంబులెన్స్ మాట్లాడుకుందాం.. అను కున్నా అందరూ సిండికేట్‌గా మారి రోగుల కుటుంబా లను దోచుకుం టున్నారు. రవాణా చార్జీలతోపాటు వెయిటింగ్ చార్జీల పేరుతో అదనంగానూ బాదుతు న్నారు. ఆరోగ్యం క్షీణిస్తుందేమో, ప్రాణం పోతుందే మోనన్న భయంతో బాధితుల కుటుంబ సభ్యులు అంబులెన్స్ నిర్వాహకులు అడిగినంత ఇచ్చి ఆసుపత్రులకు చేరుతున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి నగరంలోనే ఉన్న మరో ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా రూ.10వేల వరకు వసూలు చేస్తు న్నారు. ఇక చెన్నై వంటి మహానగరాలకు రోగులను తీసుకు వెళ్లాలంటే రూ.18వేల నుంచి 20వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న అంబులెన్స్ ఆపరేటర్లు ఈ తరహా దందాకు పాల్పడుతున్నారు.

బయటి వాహనాలు రానివ్వం

రోగి అవసరాన్ని బట్టి అంబులెన్స్‌ల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతు న్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన అంబులెన్స్‌ల నిర్వాహకులైతే మరీ బరితెగించి పోతున్నారు. వారి అంబులెన్స్‌లు మాత్రమే వినియోగించుకో వాలని, బయటి నుంచి అంబులెన్స్‌లు ఆసుపత్రికి రాకూడదని ఆంక్షలు విధించారు. వీరికి కొంతమంది జీజీహెచ్ సిబ్బంది కూడా సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొన్ని అంబులెన్సులలో ఆక్సిజన్ లేకపోయినా ఉన్నట్లు భ్రమింప చేసి ఆక్సిజన్‌కు ఎక్కువ మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

మృతదేహాల తరలింపూ భారమే!

జీజీహెచ్‌లో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని వారి ఇంటికి తరలించేందుకు ఆసుపత్రి ఎదుటే శీతల శవపేటికలతో కూడా అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంటాయి. అయితే ఆ వాహనాల్లో శవాలను తరలించేందుకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. మనిషి ప్రాణం పోయింది... అంత డబ్బులిచ్చుకో లేమన్నా కనికరించడం లేదు. జీజీ హెచ్‌లో మహాప్రస్థానం వాహనాలు ఉన్నప్పటికీ అవి పగటి పూట మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలో సాయంత్రం ఆరు గంటల తర్వాత రోగులు మరణిస్తే ప్రైవేట్ అంబు లెన్సులలోనే తరలించక తప్పడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది.

అధికారుల పర్యవేక్షణ కరువు

జిల్లా వ్యాప్తంగా 160 అంబులెన్సులు ఉన్నట్టు రవాణాశాఖ అధికారులు చెబుతు న్నారు. డ్రైవర్ బేటాసహా అంబులెన్స్ చార్జీలను ప్రాంతాల వారీగా అధికారులు నిర్దేశించారు. కానీ అవి అమలు కావటం లేదు. అంబులెన్సుల దోపిడీ వ్యవహారం అధికారులకు తెలిసినా ఏదైనా సంఘటన జరిగితేనో, ఉన్నతాధికారులు ఆదేశిస్తేనో తప్ప తనిఖీలు, ధరల నియంత్రణ విషయాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

రవాణాశాఖ నిర్ణయించిన ధరలు ఇలా...

వెళ్లే రూటు	కిలోమీటర్లు	మినీవ్యాను ధర	టెంపో అంబులెన్స్ ధర
నెల్లూరు టూ తిరుపతి	150	6000	11,500
నెల్లూరు టూ చెన్నై	200	7000	13,000
నెల్లూరు టూ బెంగుళూరు	450	13,000	25,000
నెల్లూరు టూ హైదరాబాద్	525	15,000	25,000
నెల్లూరు టూ విజయవాడ	300	9000	15,000
నెల్లూరు పరిధిలో	10	800	1500

అక్రమంగా వసూలు చేస్తున్నారు



రోగుల అవసరాలను బట్టి అంబులెన్స్ నిర్వాహకులు అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రులకు వెళ్లే రోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నా అధికారులు చూస్తూ ఊరుకోవటం బాధాకరం. ప్రధానంగా జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు అంబులెన్స్ నిర్వాహకులతో సంబంధాలు ఉన్నాయి. విధిలేని పరిస్థితిలో రోగుల కుటుంబ సభ్యులు అవస్థలు పడుతూ అంబులెన్స్ నిర్వాహకులు అడిగినంత చెల్లిస్తున్నారు.

- ఎల్లంకి వెంకటేశ్వర్లు, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

అలాంటి సిబ్బందిపై చర్యలు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది బయటి అంబులెన్స్ నిర్వాహకులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుని అక్రమాలను అరికడతాం. అంబులెన్సులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ అందుబాటులో ఉన్నాయి. అత్యవసర రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించటం జరుగుతుంది. ఎవరైనా మరణిస్తే మహాప్రస్థానం వాహనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఆర్టీసీ బస్టాండులో ఒకరి మృతి

నెల్లూరు (క్రైం), ఆగస్టు 23: నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిం చారు. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై పాచిరంగు టీషర్టు, ముదురు సిమెంట్ రంగు లోయర్ ఉన్నాయని తెలిపారు. ఇతర ఆధారాలు లభ్యం కాకపోవడం తో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు తమకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.


ఆర్టీసీ బస్టాండులోని మృతదేహం

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం : శ్రావణ శుక్రవారం సందర్భంగా జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం పూజలో పాల్గొన్న మహిళలకు ప్రసాదములు పంపిణీ చేశారు. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం అమ్మవారికి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కాగా, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కుమారుడు దినేష్‌రెడ్డిలు కుటుంబ సమేతంగా శుక్రవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

సీబీఎస్‌ఈ సామర్థ్య పరీక్ష పరిశీలన

తోటపల్లిగూడూరు : చెన్నపల్లిపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకులంలో సీబీఎస్‌ఈ సిలబస్‌పై విద్యార్థులకు నిర్వహిస్తున్న అభ్యసన సామర్థ్య పరీక్షలను సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్ బాబు, జిల్లా నోడల్ ఆఫీసర్ కేవీఆర్ మూర్తి పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సీబీఎస్‌ఈలో మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ, ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, రమణ ప్రసాద్, విద్యాధరి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 28.496 టీఎంసీల నీటి నిల్వ

● 16,572 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 16,572 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.496 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చిరు వ్యాపారి అదృశ్యం

నెల్లూరు(క్రైం): నెల్లూరులో ఓ చిరు వ్యాపారి అదృశ్యమైనట్లు చిన్నబజారు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కోటమిట్టకు చెందిన వ్యాపారం, కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల గాలించినా ప్రయోజనం లేక పోయింది. దీంతో అల్లానూర్‌ఖాన్ తండ్రి ఖుద్దై నూర్‌ఖాన్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

జూడాల సమ్మె విరమణ

● సుప్రీంకోర్టు, ప్రభుత్వ హామీతో శాంతి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఈ నెల 15 నుంచి జూనియర్ వైద్యుల సంఘం నెల్లూరులో చేపడుతున్న సమ్మె, నిరసన దీక్షలను శుక్రవారం విరమించింది. నిందితులను కఠినంగా శిక్షించేలా సుప్రీంకోర్టు సీబీఐకి కేసును అప్పగించటం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ కేసులపై సీరియస్‌గా ప్రకటన చేయటంతో జూనియర్ డాక్టర్లు శాంతించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరా దేవి జూడాల దీక్ష శిబిరానికి చేరుకుని నిరసనను విరమించాలని కోరారు. కోల్‌కతా ఘటన యావద్దేశాన్ని కలిచి వేస్తోందని, దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు. డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ మునీర్ ఖన్నా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళావతి, డాక్టర్ గీతాలక్ష్మి, ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీరస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న జూడాలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి

● కాగా, 'కోల్‌కతా' ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతూ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్‌కు ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్ వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ హామీతో తాము నిరసన దీక్షను విరమిస్తున్నామని, యథావిధిగా వైద్య సేవలు కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులకు హై సెక్యూరిటీ భద్రత కల్పిస్తామని డాక్టర్ గంగాధర్ హామీ ఇచ్చారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

నెల్లూరు(వైద్యం) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధ నలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చ రించారు. శుక్రవారం నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. పీసీ, పీఎన్ డీటీ చట్టాలను అనుసరించి స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాలని సూచించారు. తప్పని సరిగా ధరల పట్టికను ప్రదర్శించాలని, ఎట్టి పరిస్థితిలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని ఆదేశించారు. ఈ తనిఖీలో డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సర్దు'పోటు'

● జీవో నెం.117 ఎఫెక్ట్.. భారీగా పోస్టుల మిగులు

● మండలాల వారీగా కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య), ఆగస్టు 23 : వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాలు పాఠశాల విద్యపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జీఓ నెం.117 కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతోపాటు ఉపాధ్యాయ పోస్టులు భారీగా మిగులుగా తేలాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న సర్దుబాటు చర్యలు కొలిక్కి రావడం లేదు. ఎక్కువగా ఎస్‌జీటీ పోస్టులు మిగిలిపోతుండటంతో సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. మూడు రోజులుగా సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతున్నా నేటికీ అభ్యంతరాలు, సవరణలతోనే గడిచిపోతోంది. తొలుత మండల స్థాయిలోనే కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సర్దుబాటు చేస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే ఎస్‌జీలను సర్దుబాటు చేయనున్నామని అధికారులు చెపుతున్నారు.

● 870 మంది మిగులు..

జిల్లాలో 870 మంది మిగులు టీచర్లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. నెల్లూరు రూరల్‌లో 82 మంది అత్యధికంగా, వింజమూరులో 8 మంది అత్యల్పంగా ఉన్నారు. కోవూరులో 56, పొదలకూరులో 52, కందుకూరులో 32, నెల్లూరు అర్బన్‌లో 32, వెంకటాచలంలో 32, జలదంకిలో 28, బుచ్చిలో 30, కోవూరులో 30 మంది మిగిలిన అన్ని మండలాల్లో 20 నుంచి 10 మంది మిగులు టీచర్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 16వ తేదీ వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేస్తారని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో పాఠశాలల్లో నమోదు కాని విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు యూడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులంతా పాఠశాలలకు రావాల్సిందేనని విద్యా శాఖ ఆదేశాలు చేసింది. దీని ప్రకారం ప్రస్తుతం కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే 2025, మే నెల చివరిలో ఉద్యోగ విరమణ పొందేవారు, 70 శాతం కంటే ఎక్కువ శారీరక వైకల్యం కలిగిన వారు, అవివాహిత యువతులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారు, మానసిక సమస్యలతో బాధపడే పిల్లలున్న వారికి సర్దుబాటులో వెసులుబాటు కల్పించారు.

● ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

మూడు నుంచి పదోతరగతి వరకు ఒకే పాఠశాల విషయంలో నెలకొన్న ఇబ్బందులు, మెజార్టీ ప్రాథమికోన్నత పాఠశాలలు ఎస్‌జీటీలకే పరిమితం కావడం తదితర అంశాలను చక్కదిద్దితే తప్ప పరిస్థి కొలిక్కి రాదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. మరోవైపు కొందరు విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లు, మరికొందరికి ఎస్‌జీటీలు బోధన సాగిస్తుండటం గందరగోళంగా మారింది. ఇప్పటికే అన్ని మండలాల్లో 250కుపైగా అభ్యంతరాలు రావడం, ఉపాధ్యాయ సంఘాలు అడ్డు చెపుతుండటంతో కొన్ని ప్రాంతాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. అధికారులు వీటిని అధిగమించి ఉపాధ్యాయుల సర్దుపోటును ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాల్సిందే.

గ్రామాల అభివృద్ధే గ్రామసభల లక్ష్యం

● అధికారుల తీరుపై ఎమ్మెల్యే దగుమాటి ఆగ్రహం


కావలిరూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య

కావలిరూరల్, ఆగస్టు 23 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామసభల్లో ప్రజలకు అవసరమైన పనులు గుర్తించి చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలపెంట సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలు ముందుగా తెలుసుకుని ప్రజలతో చర్చించి గ్రామసభల్లో ఆమోదింప చేయాలన్నారు. ఇక్కడ అందుకు భిన్నంగా జరిగిందంటూ పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీడీ మృదుల, ఎమ్పీడీవో శ్రీధర్ బాబు, డీఎస్పీ వెంకటరమణ, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్యామల, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా త్వరలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభింపచేస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో పంచాయతీ సర్పంచు మామిడి అంకమ్మ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, తహసీల్దారు సురేష్‌బాబు, డీఎస్పీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, మండల అధికారులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : పార్టీల కతీతంగా గ్రామాభివృద్ధి కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. నార్త్‌ఆములూరులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధికి ఉపాధిహామీ పథకం నిధులు అవసరమన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, నాయకులు బండి అమర్‌రెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రుద్రయ్య, భాస్కర్, ప్రభాకర్, కరుణాకర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలే ధ్యేయం : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు : గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కొండముడుసుపాలెంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులను కేవలం ఉత్సవ విగ్రహాలుగా చూసిందన్నారు. కానీ చంద్రబాబునాయుడు ఇటీవలే రూ.1450 కోట్ల ఆర్థికసంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏడీఏ అనసూయ, డీఎల్‌పీవో కృష్ణమోహన్, సర్పంచు తుమ్మా కోటేశ్వరమ్మ, ఏపీడీ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : పంచాయతీల ఆర్థిక బలోపేతమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆత్మకూరు గ్రామం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన పాలొని మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులు అందించిన అర్జీలపై అక్కడే ఉన్న వివిధ శాఖల మండల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ విజయ, సర్పంచు నాళం గోవిందమ్మ పాల్గొన్నారు.

జలదంకి : ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలకు మంచి స్పందన వచ్చింది. మడంలంలో 17 పంచాయతీలలో గ్రామ సభలు జరిగాయి. గ్రామాల అభివృద్ధికి పనులు గుర్తించారు.

వలేటివారిపాలెం: మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభలు జరిగాయి. వలేటివారిపాలెం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సభలో పంచాయతీ కార్యదర్శి స్వాతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాధు శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్ వీరమోసు అంజయ్య, టీడీపీ నాయకులు వలేటి మధుసూదన్ రావు, వలేటి నరసింహం, కాకుమాను మాల్యాద్రి, పరిటాల బాస్కర్‌రావు, కాకుమాను ఆంజనేయులు పాల్గొన్నారు.

కొండాపురం : మడంలంలోని 19 పంచాయతీలలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఆదేశాల మేరకు గ్రామాల్లో సీసీ రోడ్లు, పొలాలకురోడ్లు, భూములకు సరిహద్దు కందకాలు తవ్వడం, వ్యక్తిగత భూములలో వ్యవసాయ బావులు నిర్మాణం, తదితర పనులు గుర్తించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. భీమవరప్పాడులో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల చిత్రపటాలను టీడీపీ నేత ఎమ్.వెంకటేశ్వర్లు అధికారులకు అందచేశారు.

కలిగిరి : మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, ఎంపీపీ మెట్టుకూరు శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పనులు గుర్తించి ఆమోదం తెలిపారు.

లింగసముద్రం : ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అటవీ అధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, టీడీపీ నేతలు యు మాధవ, ఎన్ నారాయణ, ఆర్ మాలకొండయ్య, ఎల్ ప్రసాద్, ఎ.రంగయ్య, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

చేజర్ల : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ విజయ లలిత తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సమక్షంలో నిర్వహించిన గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధుల, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉలవపాడు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి


కొండాపురం : మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అలీ


కలిగిరి : గ్రామసభలో పాల్గొన్న చిరంజీవిరెడ్డి


లింగసముద్రం : సభలో డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి


జలదంకి : గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు


సీతారామపురం: మాట్లాడుతున్న సర్పంచ్

మర్రిపాడు: మండలంలోని 24 పంచాయితీల్లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి అధికారులు గ్రామసభలు నిర్వహించారు. పొలాల దారులకు మట్టిరోడ్లు, గ్రామాల్లో సిమెంట్, తారు రోడ్లు, డ్రైనేజీ పనులకు సంబంధించి సమస్యలను గుర్తించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు మంజూరు కోసం తీర్మానాలు చేశారు. డీసీపల్లిలో జరిగిన క్యాక్రమంలో డీఎల్‌పీవో నారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, కార్యదర్శులు, పాల్గొన్నారు

సంగం : పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలు అట్టహాసంగా జరిగాయి. ప్రజలు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికొచ్చారు. అధికారులు వాటిని నమోదు చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. సంగంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయలురెడ్డి, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

● జండాదిబ్బలో జరిగే గ్రామసభకు కలెక్టర్ ఆనంద్ హాజరవుతారని సాయంత్రం వరకు మండలస్థాయి అధికారులు వేచి చూశారు. చివరికి కలెక్టర్ రారని ఉన్నతాధికారులు చెప్పడంతో వారు గ్రామసభను నిర్వహించారు.

ఉదయగిరి రూరల్: 17గ్రామ పంచాయతీల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేశారు. గంగిరెడ్డిపల్లిలో జరిగిన సభలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ఆవరణను ఉపాధి నిధులతో చదును చేయించాలని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంపీడీవో ఈశ్వరమ్మతోపాటు ప్రత్యేకాధికారులు వారికి కేటాయించిన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, సర్పంచ్ వరలక్ష్మి, ఓబులరెడ్డి, శ్రీరాములు, తుమ్మల కిరణ్, గడ్డం నాయుడు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, నాయకులు లక్ష్మీనారాయణ, గంగవరపు పుల్లయ్య, చంద్ర ప్రభాకర్, ఈ వోపీఆర్డీ సికిందర్, సర్పంచులు నారాయణమ్మ, మహేష్, సుశీల, అరికొండ పెంచలమ్మ, ఉప సర్పంచ్ పాలకొల్లు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో మల్లికార్జున్ వరికుంటపాడు, రామాపురం సభలను పరిశీలించారు.

గ్రామస్థులతో కలెక్టర్ ముఖాముఖి


గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరు : మండలంలోని నువ్వూరుపాడులో జరిగిన గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ ఆనంద్ ముందు వెళ్లబోసుకున్నారు. భూముల రీసర్వే వల్ల గ్రామాల రైతుల మధ్య విభేదాలు, తగాదాలు వస్తున్నట్లు విన్నవించారు. చెరువును రావులుకొల్లుకు చెందిన కొందరు ఆక్రమించుకోవడంతో ఉపాధి పనులు చేసుకునే వెసులుబాటులేదని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వనీపురంలో శ్మశానానికి వెళ్లేందుకు దారిని అడ్డగించి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. పాతజంగాలపల్లిలో సైతం శ్మశానంలోకి వెళ్లేందుకు దారి కల్పించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ శ్మశానానికి దారులను ఉపాధిహామీ, జడ్పీ నిధులతో వేయిస్తామన్నారు. ఆక్రమణలు ఉంటే సర్వే చేసి వెంటనే తొలగిస్తామని తెలిపారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు పనులు వేగవంతం చేస్తామన్నారు. అంతకుముందు టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నంనాయుడు, ఇన్‌చార్జ్ ఆర్డీవో ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, తహశీల్ధారు వి సుధీర్బాబు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ దొరసానమ్మ, నువ్వూరుపాడు, అశ్వనీపురం, అంబేద్కర్‌నగర్, పాతజంగాలపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీతారామపురం : గ్రామ పంచాయతీలోని సచివాలయం బిట్-2లో సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్రజా నిర్ణయాలకు గ్రామసభలతో శ్రీకారం చుట్టి వారికి జవాబుదారీగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఇన్


వింజమూరు : మాట్లాడుతున్న నిర్మలాదేవి

చార్జి ఎంపీడీవో భార్గవి, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకట సుబ్బమ్మ, కార్యదర్శి జీవన్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నందిపాడు, దుత్తలూరు, కొత్తపేట, నర్రవాడ, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు తదితర పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యారాణి పలు పంచాయతీల్లో గ్రామసభలను పరిశీలించారు. టీడీపీ నేత చంద్ర మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వింజమూరు : మండలంలోని 12 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వింజమూరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ నిర్మలాదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ సృజన, జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, పంచాయతీ ఈవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చేజర్ల: చిత్తలూరులో పాల్గొన్న గ్రామస్థులు


సంగం: వెంగారెడ్డిపాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్


ఉదయగిరి రూరల్: వినతిపత్రం ఇస్తున్న టీచర్లు


వరికుంటపాడు: గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ముగిసిన గ్రామదేవతల తిరునాళ్ల

అనంతసాగరం, ఆగస్టు 23: లింగంగుంట గ్రామదేవతలు ఆంకాళమ్మ, చింతాలమ్మ తిరునాళను భక్తులు మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం (చివరిరోజు) అమ్మవారికి భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

డీలర్ల సమావేశం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 23: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం మండల చౌక దుకాణాల డీలర్లతో తహసీల్దారు ఎం.సుభద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో డీడీలు చెల్లించి వినియోగదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని సూచించారు. దుకాణాల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు సర్వే పరిశీలన

వరికుంటపాడు, ఆగస్టు 23: కాకొల్లువారిపల్లిలో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను శుక్రవారం తహసీల్దారు ఎస్ఎండీ హుసేన్ పరిశీలించారు. నూతన ఓటర్లు మార్పులు, చేర్పులు, తొలగింపులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే రామాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం విరువూరులో అటవీ భూమిని పరిశీలించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 23: ఉలవారిపాళెం గ్రామంలో శుక్రవారం ఇన్‌చార్జి పశువైద్యాధికారి మధు సూచన మేరకు సిబ్బంది పశువులు, దూడలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

ఉలవపాడు, ఆగస్టు 23: ఉలవపాడు ఎస్సైగా అంకమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బాజీరెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సైకు సాదర స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.


ఉదయగిరిరూరల్: నివాళులర్పిస్తున్న తహసీల్దారు, సిబ్బంది


అనంతసాగరం: గ్రంథాలయంలో విద్యార్థుల నివాళి


సంగం: నివాళులర్పిస్తున్న విద్యార్థులు


ఏఎస్ పేట: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది

ఆంధ్రకేసరి టంగుటూరికి ఘన నివాళి

కందుకూరు, ఆగస్టు23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కోవూరు రోడ్డులోని ఆంధ్రకేసరి విగ్రహనికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెల్లదొరల తుపాకీకి ఎదురొడ్డి గడగడలాడించిన మహనీయుడు టంగుటూరి మనప్రాంతవాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు మంచిరాజు మురళి, ఇప్పగుంట నాగరాజారావు, ఇప్పగుంట మాధవరావు, పవని నాగేంద్ర ప్రసాదు, గణపతిరాజు శేషగిరిరావు, కాకర్ల రాజగోపాల్, రాధాకృష్ణమాచార్యులు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, డాక్టరు తన్నీరు మల్లికార్జున, దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉలవపాడు: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక గ్రంథాలయం, తహసీల్దారు కార్యాలయంలో టంగుటూరి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజానికి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దారు వీరవసంతరావు, గ్రంథాలయాధికారి నారాయణరావు, బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎం.సుభద్ర, సిబ్బంది, డీలర్లు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీటీ చెన్నకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ సందానీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్, ప్రొఫెసర్లు నారాయణస్వామి పాల్గొన్నారు.

దుత్తలూరులో..: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి తహసీల్దారు నాగరాజు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంగం: స్థానిక శాఖ గ్రంథాలయంలో అధ్యాపకులు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు మాల్యాద్రి టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


కందుకూరులో ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఏఎస్ పేట : స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసలు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతారామపురం: స్థానిక జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజాద్‌భాషా, సుభాన్‌భాష, వెంగయ్య, జయరామిరెడ్డి పాల్గొన్నారు.


సీతారామపురంలో...


ఉలవపాడులో పూలమాలు వేసిన అధ్యాపక సిబ్బంది

ప్రజల కోసం పరితపించే ప్రభుత్వం టీడీపీ


మాజీ ఎమ్మెల్యే బొల్లినేనితో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 23: ప్రజల కోసం పరితపించి సేవ చేసేది టీడీపీ ప్రభుత్వమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని అన్న క్యాంటీన్ ఎదురుగా 100అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ జెండా ఐకాన్‌ను శుక్రవారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావుతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఐకాన్ నిర్మాణం ఆవశ్యకతను తెలియచేస్తూ అక్కడ ఆయనతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల కృషితో కావలి-తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి సెప్టెంబరు1న పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే తుమ్మలపెంటవద్ద ఉన్న పర్యాటక కేంద్రం కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, నేతలు గుత్తికొండ క్రిషోర్, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోతుగంటి అలేఖ్య పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఏఎస్ పేట, ఆగస్టు 23: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు డీవైఈఓ గోపాల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గుంపార్లపాడులోని జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఇటీవల నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం పోతులూరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆధార్‌కార్డు మంజూరు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 23: స్థానిక సినిమాహాలువీధికి చెందిన షేక్ ఖాజావలి అనే దివ్యాంగడికి తహసీల్దారు ఎం.సుభద్ర శుక్రవారం ఆధార్‌కార్డు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. గత కొన్నేళ్లుగా ఖాజావలి ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆరునెలల కిం దట కుక్కకాటుకు గురై అతను వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో వైద్యులు కాలు తొలగించారు. దీంతో పింఛ న్‌కు దరఖాస్తు చేసుకొనేందుకు ఆధార్ లేక అవస్థలు పడుతుండే వాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు వీఆర్వోలతో కలిసి కార్యాలయ ఆవరణలోని ఖాజావలి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ నమోదు కేంద్రంలో అతనికి ఆధార్ నమోదు చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సందానీ, వీఆర్వోలు జాఫర్, వెంకటేశ్వర్లు, అంజాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్ కింద నలిగిన వృద్ధుడి కాలు

ఏఎస్ పేట, ఆగస్టు 23: ప్రైవేట్ ట్రావెల్ బస్సు చక్రాల కింద కడప పట్టణానికి చెందిన వృద్ధుడు (60) కాలు నలిగిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. దర్గాకు వచ్చిన ఆయన సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్టాండ్ సెంటర్‌కు వచ్చి అక్కడ మద్యం సేవించి బస్సు కోసం కాలు చాపి కూర్చున్నాడు. ఈ సమయంలో అటుగా వచ్చిన ప్రైవేట్ బస్సు వెనుక చక్రాలు వృద్ధుడి కాలు తొక్కుకుంటు వెళ్లింది. గమనించిన స్థానికులు కేకలు వేసిన డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు గమనించి 108లో వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

కావలి టౌన్, ఆగస్టు 23: జవహర్ భారతి డిగ్రీ కళాశాల లో శుక్రవారం ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు అధ్యక్షతన జాతీయ అంతరిక్ష దినోత్సవం జరిగింది. భౌతికశాస్త్ర అధ్యాపకుడు సీవీ సుబ్బారావు మాట్లాడారు. ఆగస్టు 23న చంద్రయాన్ 3విక్రమ్ ల్యాండర్ సేఫ్‌గా చంద్రుని దక్షిణధృవంలో ల్యాండ్ అయిన సందర్భంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు మా ట్లాడుతూ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ దేశానికే గర్వకారణమన్నారు. స్పేస్ లోగో, ప్లకార్డులు ప్రదర్శించారు.

వృద్ధులకు చీరల పంపిణీ

కావలి టౌన్: వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ ఉషారాణి సౌజన్యంతో వృద్ధు లకు చీరలు, భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో సంయుక్త సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ మానసిక వైద్య నిపుణులు పార్థసారథి, చర్మవ్యాధుల నిపుణులు ఉషారాణి దంపతులు పేదలు, వృద్ధులు, అనాథలకు అండగా ఉండటం అభినందనీయమన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు అరికట్టండి

● మండల సమావేశంలో జడ్పీటీసీ ఆగ్రహం

వలేటివారిపాలెం, ఆగస్టు 23: బడేవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టకుంటే పీడీకి ఫిర్యాదు చేస్తానని జడ్పీటీసీ ఇంటూరి భారతి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ పనికి వెళ్లిన వారికి రోజుకు రూ.120, వెళ్లని వారికి రూ.300 కూలి ఇవ్వడం, దీనిని ప్రశ్నిస్తే పని కల్పించకపోవడం, పనులు కావాలని కోరిన వారిని అసలు పట్టించుకోకపోవడం ఏమిటని సంబంధిత అధికారులను నిలదీశారు. కూలీలకు సమానవేతనం ఇవ్వకుండా ఇలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి కూడా ఆశాఖ ఏపీఎం రాకపోవడమేమిటని ప్రశ్నించారు. వర్షాలకు కురుస్తునందున్న సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాని తెలిపారు. అయ్యవారిపల్లెలో పశువు మృత్యువాత పడి ఏడాది దాటినా నష్ట పరిహారం చెల్లించడంతో జాప్యం ఎందుకు జరుగుతుందని ఎంపీపీ సంబంధిత విద్యుత్‌శాఖాధికారిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషుబాబు, వైద్యాధికారి మణిదీపిక, విద్యుత్ ఏఈ మధుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా, వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత కోసమే గ్రామసభలు

అక్రమాలను ఉపేక్షించం : ఎమ్మెల్యే సోమిరెడ్డి ● ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



వెంకటాచలం: ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కోవూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: పెనుబల్లి దళితవాడలోని కమ్యూనిటీ హాలులో తగులబడిన ఓటరు ఐడీ కార్డులు

వెంకటాచలం, ఆగస్టు 23: గ్రామాల్లో చేపట్టే పనుల్లో పారదర్శకత కోసమే గ్రామసభలు నిర్వహించినట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కురిచెర్లపాడులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలను వెల్లడించమంటే సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నీళ్లు నమిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనరంజక పాలనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, పలువురు అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని అనికేపల్లిలో శుక్రవారం చేపట్టిన గ్రామసభ రచ్చకు దారితీసింది. పంచాయతీ కార్యదర్శి వెందోటి బాబుపై గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీలో ఎక్కడా అభివృద్ధి పనే జరగలేదని, పంచాయతీ నిధులన్నీ స్వాహా చేసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న టీడీపీ నేతలు కల్పించుకొని గ్రామస్థులకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అదేవిధంగా ఎర్రగుంట గ్రామసభ విషయమై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని గ్రామస్థులు అధికారులకు ఫోన్‌చేసి నిలదీశారు.

●**పొదలకూరు:** వైసీపీ పాలనలో పనులు చేయకుండానే చేసినట్లు చూపించి రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యగారిపాలెంలో గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి స్వగ్రామమైన తోడేరు, మరుపూరులో భూ అక్రమాలను త్వరలోనే బయట పెడతామన్నారు. అయ్యగారిపాలెం శ్మశానానికి దారి, చెరువుకు నీరు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్ కుమారి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ కండె వసంతమ్మ, కండె నరసయ్య, పీపీఎస్ ప్రసాద్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

●**మనుబోలు:** మండలంలోని పిడూరులో శుక్రవారం జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే సోమిరెడ్డి, మాజీ ఎంపీ పనబాక లక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిడూరు ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకటేశ్వర్లురెడ్డి, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుబ్బయ్య, కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్‌వో శీనమ్మ, టీడీపీ నాయకులు టి. శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటైన గ్రామసభలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్థానికసంస్థలపై దృష్టి పెట్టారన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పంచాయతీలకు నిధులు కేటాయించారని చెప్పారు. కాగా, వయనాడు వరద బాధితులకు సీఎం సహాయనిధికి ఆర్థికసహాయం అందించిన స్థానికుల్ని ఆమె అభినందించారు. ఎంపీడీవో శ్రీహరి అధ్యక్షత వహించిన గ్రామసభలో డీపీవో సుస్మితారెడ్డి, తహసీల్దారు నిర్మలానందబాబు, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ శ్రీలత, సర్పంచు విజయమ్మ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, పిచ్చుక మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ఉప సర్పంచు గాదిరాజు అశోక్‌కుమార్ మాట్లాడుతూ నెల్లూరు బ్యారేజీకి దివంగత నెల్లూరు నగర శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి పేరు పెట్టాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** చెల్లాయపాళెం, జొన్నవాడ, దామరమడుగు, కాలయకాగొల్లు, ఇస్కపాళెం, కట్టుబడిపాళెం, మినగల్లు, పెనుబల్లి, మునులపూడి, నాగాయగుంట, నాగమాంబాపురం, పంచేడు, రేబాల గ్రామాలలో గ్రామసభలకు వచ్చిన ప్రజలు స్థానిక సమస్యలను అధికారులకు తెలిపారు. ప్రధానంగా పాత, కొత్త మినగల్లు గ్రామాలు వరదముంపునకు గురికాకుండా పెన్నా పొర్లుకట్టలు పటిష్టం చేసేలా తీర్మానం చేస్తున్నట్టు గ్రామ సర్పంచు బొర్రు పూజిత, సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ నాగిరెడ్డి కీర్తన టీడీపీ నాయకులు గ్రామ ప్రజలకు తెలిపారు. గ్రామసభల్లో డ్వామా పీడీ శ్రీనివాసరావు, డీఎల్‌డీఓ వసుమతి, మెప్మా పీడీ రవీంద్రబాబు, పలు శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కాగా, మండలంలోని పెనుబల్లి దళితవాడలోని కమ్యూనిటీ హాలులో తగలబడివున్న సుమారు 100 ఓటరు ఐడీ కార్డులను అదే దళితవాడకు చెందిన మాధవ్ అధికారులకు దృష్టికి తీసుకెళ్ళాడు. వాటిని చూసిన అధికారులు అవాక్కై, ఇలాంటి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు చేపడతారని అతనికి సూచించారు.

●**ఇందుకూరుపేట:** మైపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి డి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు గంపల సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీ గుడి సుబ్ర హ్మణ్యం, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● **కొడవలూరు:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి రెడ్డి అమరేంద్రరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో శుక్రవారం గుండాలమ్మపాలెం, నార్తు రాజుపాళెంలో జరిగిన సభల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గుండాలమ్మపాళెం గ్రామసర్పంచ్ కోటంరెడ్డి దివ్యరెడ్డి, నాయకులు పాటూరి రమేష్, కరకటి మల్లికార్జున, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

●**విడవలూరు:** గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య తెలిపారు. విడవలూరులోని సచివాలయంలో సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, మాతూరి శ్రీనివాసులురెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, తదితరులు పాల్గొన్నారు. ఊటుకూరులో గ్రామసర్పంచ్ వెంకటశేషమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ముదివర్తిలో జరిగిన గ్రామసభలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించారు. రామతీర్థంలో సర్పంచ్ సుజన ఆధ్వర్యంలో పలు పనులపై తీర్మానం చేశారు. పార్లపల్లిలో సర్పంచ్ రామిశెట్టి స్వాతి ఆధ్వ ర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ పాల్గొన్నారు. దంపూరులో సర్పంచ్ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో టీడీపీ నాయకులు దూది విజయ రాఘవన్, చేవూరు రాంప్రసాద్, కొమ్మి శ్రీధర్‌నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, దండిగుంట గ్రామంలో జరిగిన గ్రామసభ రసాభసగా జరిగింది. గ్రామసభలో అధికార పార్టీ నేతలు హాజరుకావడం పట్ల సర్పంచ్ భర్త అభ్యంతరం తెలపడంతో టీడీపీ నాయకులకు సర్పంచుకి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకోవడంతో గ్రామసభ రసాభసగా జరిగింది.

● **తోటపల్లిగూడూరు** : గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా మౌలిక వసతులు కల్పించుకోవచ్చని, తద్వారా గ్రామాభివృద్ధి చెందుతుందని మండల ప్రత్యేక అధికారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చిన్నఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో నరుకూరు గ్రామసభలో ఆయన మాట్లాడారు. అనంతరం తోటపల్లిగూడూరు, పాపిరెడ్డి పాలెం, కొత్తపాలెం, కోడూరు, వీలుకానిపల్లి, సౌత్‌ఆములూరు, తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నం శారద, ఎంపీటీసీ రఘుబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●**రాపూరు:** స్థానిక సచివాలయం బిట్-1 ప్రాంగణంలో సర్పంచ్ భూపతి జయమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీలో చేయాల్సిన పనులపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో ఏడుకొండలు, ఎంపీపీ ప్రసన్న, ఎస్‌ఐ మాల్యాద్రి, టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, ముక్తార్, మాజీ సర్పంచ్ రత్నం, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం: కూటమి ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళతామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రామసాగ రంలో జరిగిన గ్రామసభ లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తుమ్మలతలుపూరు గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి రమాదేవి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో పురుషోత్తం, శివకుమార్ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.


పంచాయతీల హక్కులు కాలరాస్తున్నారు

మనుబోలు : టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పంచాయతీల హక్కులు, అధికారాలను కాలరాస్తున్నారని కాంగ్రెస్ నేత నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. అక్కంపేటలో సచివాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆగిన రాజన్న జలధార వాటర్‌ప్లాంట్‌ను త్వరలో పునఃప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 23: అర్బన్ సీఐ పి శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం పలువురు టీడీపీ నాయకులు సత్కరించారు. అనంతరం స్థానిక సమస్యలపై ఆయనతో చర్చించారు. సీఐని కలిసిన వారిలో నాయకులు రామానాయుడు,తాళ్ళ నరసింహస్వామి, ఉసురుపాటి ప్రసాద్, తదితరులున్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



కోవూరు: ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

కోవూరు, ఆగస్టు 23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, ఎంపీటీసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామ యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం :** మండలంలోని జొన్నవాడ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఆలయ ఈఓ. ఏవీ శ్రీనివాసులురెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

'గండికోట'కు ఇస్రో ప్రశంసా పత్రం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 23: రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సామాజికవేత్త గండికోట సుధీర్‌కుమార్‌కు జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్లైన్ ద్వారా శుక్రవారం ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఇస్రో ప్రశంసాపత్రం అందజేశారు. ఈమేరకు ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం తదితరులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే కాకాణికి శిక్ష తప్పదు : చాట్ల

వెంకటాచలం, ఆగస్టు 23 : గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ప్రతి తప్పుకు శిక్ష అనుభవించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాట్ల వెంకటసుబ్బయ్య విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. సర్వేపల్లి అభివృద్ధిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఇది ఓర్వలేక మాజీ మంత్రి కాకాణి సోమిరెడ్డిపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. సమావేశంలో రమేష్, సునీల్, రామ్‌మోహన్, వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సోమిరెడ్డిపై అసత్య ఆరోపణలు తగదు

వెంకటాచలం, ఆగస్టు 23 : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం తగదని బీజేపీ నేతలు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. తమ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లిపాకుల పెంచలయ్య సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై గత రెండు రోజుల కిందట చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, ప్రతిపక్షం పన్నిన కుట్రలో పావుగా మారారని తెలిపారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త రవీంద్రారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు,తదితరులున్నారు.

నేడు బుచ్చి కౌన్సిల్ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు23: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం నగర పంచాయతీ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ ఏవీ రమణబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

దేవీ నారాయణీ నమోస్తుతే!

శ్రావణ శుక్రవారం ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు



విశేష అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు, కుంకుమార్చన చేస్తున్న భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 : శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని ఆలయాల్లో విశేష పూజలు, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు జరిగాయి.

● రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. అమ్మవారికి అభిషేకాలు నవావరణ పూజలు, సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. భక్తులకు పసుపు కుంకుమ, జాకెట్లు, అమ్మవారి ఫొటో అందజేశారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ప్రధాన అర్చకుడు రఘురామ శర్మ, వేద పండితుడు రామకృష్ణ, ఈవో, సహాయ కమిషనర్ బీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

● సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో ఉదయం అభిషేక, అర్చనలు, సామూహిక కుంకుమార్చన జరిగాయి. సంకటహర చతుర్థి సందర్భంగా మహాగణపతికి ఉండ్రాళ్ల అభిషేకం, హోమాలు జరిగాయి. ఉభయకర్తలుగా గిరి బిల్డర్ గిరి ప్రసాద్, వాణీ దంపతులు వ్యవహరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీ కుబేర పూజ జరిగింది. మూలవర్లకు విశేష అభిషేకాలు చేశారు. విశ్వహిందూ పరిషత్, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి షేగు షణ్ముగరావు, వాణీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం మూలవర్లకు చందనా అలంకారం, పూలంగిసేవ జరిగాయి. రాత్రి 108 మంది మహిళలకు జాకెట్లు, పసుపు కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు పర్యవేక్షించారు. కాగా. నగరంలోని అన్ని మహాలక్ష్మీ ఆలయాల్లో విశేష పూజలు, కుంకుమార్చనలు జరిగాయి.

● వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ ఆధ్వర్యంలో పప్పులవీధిలోని పాండురంగ దేవస్థానంలో రుక్మాబాయికి శ్రావణ శుక్రవారం పూజలు జరిగాయి. ఉదయం 11 రకాల ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. సాయంత్రం సామూహిక కుంకుమ పూజ జరిగింది. ఉభయదాతలుగా పోకూరి మాల్యాద్రి, చంద్రకళ, పాదర్తి సాయిబాబా, వనిత, చందా శ్రీనివాసమూర్తి, సుకన్య, పాబోలు రవికుమార్, వరలక్ష్మీ, మొగిలి మధుసూదన్‌రావు, మాధవి దంపతులు వ్యవహరించారు.

● మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో సామూహిక కుంకుమ పూజ జరిగింది.

వైసీపీ పాలనలో ఒక్కరోజైన గ్రామసభ పెట్టారా?

● కాకుపల్లి గ్రామ సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 23 : వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల పరిరక్షణ కోసం ఒక్క గ్రామసభ కూడా పెట్టిన దాఖలాలు లేవని, గ్రామాల అభివృద్ధికి రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కాకుపల్లి గ్రామంలో సర్పంచ్ కోసూరు సుభాషిణి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి గ్రామ సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సభలు నిర్వహించడం ద్వారా స్థానిక సమస్యలు ప్రభుత్వానికి తెలుస్తాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సభకూడా నిర్వహించకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం గ్రామాల ఆర్థిక పరిపుష్టికి కట్టుబడి ఉందన్నారు. అందుకే ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో కావాల్సిన వనరులను సమకూర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలేంద్రకుమార్, ఎన్‌ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకుడు కోసూరు కేశవులు, మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యేల పేరిట అర్జీలు రాస్తే తీసుకోను

గ్రామంలో సమస్యలను వివరిస్తూ కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యేల పేరిట అర్జీలను తయారు చేసిన కొత్తవెల్లంటి వాసులు వాటిని గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శికి ఇవ్వగా వాటిని తాను స్వీకరించనంటూ తెగేసి చెప్పారు. కలెక్టర్, ఎమ్మెల్యేల పేరిట రాసిన అర్జీలను తాను ఎలా తీసుకుంటానని ప్రశ్నించడంతో అర్జీదారులు ఆ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జోక్యం చేసుకోవంతో కార్యదర్శి వినతులను స్వీకరించారు. కాగా, గ్రామంలో సమాచారం లేకుండానే సభలు నిర్వహించారంటూ అక్కడున్న ప్రజలు అధికారులతో వాదించారు.

ఆంధ్రకేసరి యువతకు ఆదర్శం : ఎంపీ వేమిరెడ్డి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతి కం), ఆగస్టు 23 : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశభక్తి నేటి యువతకు ఆదర్శం కావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రకాశం పంతులు 152వ జయంతి సంద ర్భంగా ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ఆంధ్రకేసరి విగ్రహానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్లు అజీజ్, భానుశ్రీ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీ మూర్తీభ వించిన మహనీయుడు ప్రకాశం పంతులు అన్నారు. మాజీ మేయర్ అజీజ్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి జయంతి రాష్ట్ర పండుగగా జరుగుతోందని, ఈ ప్రతిపాదన నెల్లూరు జిల్లా నుంచి వెళ్లిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సత్యనాగేశ్వరరావు, ఆంధ్రకేసరి అభిమానులు బ్రాహ్మణ సంఘాల నాయకులు, తెలుగుదేశం అభిమానులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా చూడాలి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం నగరం లోని వెంగళరావునగర్, తాతయ్యబడి, ఎన్ బీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించా రు. ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను గుర్తించి ఆ నీటిని ఒలకబోశారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రీనా భారతి, సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, శాంసన్‌బాబు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు గుంజ ప్రతిష్ఠ



గుంజ ప్రతిష్ఠ కార్యక్రమంలో నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 : నగరంలోని బాలాజీ నగర్ పిండి మిల్లు సెంటర్‌లో ఈనెల 26 నుంచి నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల పనులు ప్రారంభించేందుకు శుక్రవారం గుంజ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పిండిమిల్లు సెంటర్‌లో 28 ఏళ్లుగా బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 26వతేదీ సాయంత్రం 4.38 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, 27వతేదీ ఉదయం 8గంటలకు పూజా కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు ఉట్టి మహోత్సవం, 28వతేదీ ఉదయం 11.30 గంటలకు వస్త్రదానం, రాత్రి 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 29వతేదీ మధ్యాహ్నం అన్నదానం, 30వతేదీ ఉదయం 10గంటలకు నగరోత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌గా కిశోర్



నెల్లూరు(క్రైం), ఆగస్టు 23: నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్‌ఎస్ కిశోర్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిశోర్

హోరాహోరీగా వెటరన్ టీ-20 క్రికెట్ పోటీలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 23 : వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో బుజబుజ నెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో వెటరన్ టీ-20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతు న్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, కడప జట్లు తలపడగా తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 150 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 14.5 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో విజయవాడ, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన విజయవాడ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 185 పరుగులు సాధించారు. జట్టులోని లెనిన్ 53 పరుగులు సాధించారు. అనం తరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 17.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 186 పరుగుల లక్ష్యాన్ని ఛేదించారు. ఈ జట్టులోని షేక్ సమీర్ 114 పరుగులు సాధించి జట్టు విజయానికి కృషి చేయడంతోపాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ మ్యాచ్‌లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పీ భానుప్రకాష్ రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

పశువులు రోడ్లెక్కితే చర్యలు తప్పవు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 23 : నగరంలోని ప్రధాన రహదారులపై ప్రజలకు ఇబ్బందికరంగా పశువులు సంచరిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎన్‌ఎంసీ పశువైద్యుడు మదన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మద్రాసు బస్టాండ్, కోటమిట్ట, నారాయణ మెడికల్ కళాశాల ప్రాంతాల్లో రోడ్లపైనున్న పశువులను ప్రత్యేక వాహనాల్లో గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు మార్లు పశువుల పెంపకందారులకు పశువుల నియంత్రణపై సూచనలిచ్చామని చెప్పారు. ఇక ఉపేక్షించే ప్రశక్తేలేదని స్పష్టం చేశారు. రోడ్లపై కనిపించిన పశువులన్నిటినీ గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్ రోజూ జరుగుతుందని వెల్లడించారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

● చీఫ్ మెడికల్ అధికారి లక్ష్మి

నెల్లూరు (విద్య), ఆగస్టు 23 : విద్యార్థినులు కేన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ వై లక్ష్మి సూచించారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యవ్వన ప్రాయంలో వచ్చే పీసీవోడీ సమస్యలు, వయసు పెరిగే సమయంలో వచ్చే కేన్సర్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పేషెంట్ కౌన్సిలర్ జీ కన్యాకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, సమన్వయకర్త డాక్టర్ ఆర్ విజయభాస్కర్, సహ సమన్వయకర్త డాక్టర్ కే ఈశ్వరమ్మ, డాక్టర్ చెంచురామయ్య, డాక్టర్ జే కవిత, తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష దినోత్సవం...

డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ శుక్రవారం అంతరిక్ష దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ గిరి మాట్లాడుతూ ఇస్రో ఎన్నో విజయాలు సాధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యార్థులు కూడా పరిశోధనలపై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణమూర్తి, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఏవీ రమణరావు పాల్గొన్నారు.

26 నుంచి వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 : నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి గ్రామంలోని భగవాన్ వెంకయ్య స్వామి గురునిలయంలో ఈ నెల 26 నుంచి ఆరాధన వేడుకలు జరుగుతాయని భక్త బృందం ఓ ప్రకటనలో తెలిపింది. 26వతేదీ ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, పూజలు, హోమం, సహస్ర నామార్చన, భజన అనంతరం అన్నదానం జరుగుతాయని పేర్కొంది. సాయంత్రం అఖండనామ సంకీర్తనం, రాత్రి నగరోత్స వం జరుగుతాయని తెలిపింది. 27వతేదీ కూడా అభిషేకం, భజన సంకీర్తన, అన్నదానం, అఖండ నామ సంకీర్తన, నగరోత్సవం జరుగుతాయని భక్తులందరూ తరలిరావాలని కోరింది.

డీవైఎఫ్ఐ కంటి వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : నగరంలోని ఆదిత్యనగర్‌లో ఉన్న బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాసన్ ఐ కేర్ సెంటర్ వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి మందులు, కంటి అద్దాలు అందచేశారు. డీవైఎఫ్ఐ నేత రాజేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడటమే కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలను కూడా తమ సంఘం చేపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 23: నగరంలోని గోమతి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇస్కాన్‌సిటీ, నాగసాయి మందిరం, హరనాథపురం ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గుర్తించాలని కోరారు.

ప్రాణ రక్షణకే ప్రాధాన్యం : డాక్టర్ కృష్ణమూర్తి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : వైద్యులుగా ఏ పదవిలో ఉన్నా ప్రజల ప్రాణ రక్షణకే ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి వెల్లడించారు. ఆయన జీజీహెచ్‌లో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం పీహెచ్‌పీ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నరసాపురం ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి దయతోనే యాక్టరయ్యా!

'చదువుకునే రోజుల్లో సినిమాలు చూసి యాక్టర్‌ని చేయి అని సరదాగా దణ్ణం పెట్టుకుని అడిగితే వేంకటేశ్వరస్వామి నిజంగానే నన్ను నటిని చేసేశాడు. నిజానికి స్వామిని కోరుకోవాల్సిన అవసరం కూడా లేదు. వచ్చి దర్శనం చేసుకుంటే చాలు మన మనసులో ఉన్న ఏ కోరికైనా ఇట్టే తీర్చేసే దేవుడాయన'......తిరుమల వెంకన్నపై బిగ్‌బాస్-4 బ్యూటీ, లంబసింగి చిత్ర హీరోయిన్ దివికి వున్న భక్తి ప్రపత్తులివి.శ్రీవారి దర్శనానికి తరచూ వచ్చే అచ్చ తెలుగు నటి అయిన దివి స్వామివారి దర్శనంతో తన జీవితం మొత్తం మారిపోయిందంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తెలుగులో పెద్ద యాక్టర్స్‌తో నటించాలనుంది

బిగ్‌బాస్ ద్వారా 50 శాతం మంచి పేరు వస్తే, మెగా స్టార్ చిరంజీవి ప్రోత్సాహంతో ఇంకో 50 శాతం అవకాశాలు వస్తున్నాయి. ఇప్పటికే చిరంజీవి, అల్లు అర్జున్, బాలయ్య, మహేష్‌బాబుతో నటించా. ఇంకా పెద్ద యాక్టర్లతో నటించాలనుంది. తమిళ, కన్నడ పరిశ్రమల్లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి.అయితే నా మనసుకు నచ్చి పాత్రల్లోనే నటిస్తున్నా.

పుష్ప చూసి నేనెందుకు లేననుకున్నా

పుష్ప చూసినప్పుడు ఈ సినిమాలో కదా నేను ఉండాలి అనుకున్నా. వెంటనే పుష్ప-2లో నటించే అవకాశం వచ్చింది. ఇది కచ్చితంగా స్వామి లీలే. పుష్ప-2లో జర్నలిస్ట్ రోల్ చేశా. ఇప్పటికే ట్రైలర్ ద్వారా నాకు మంచి కామెంట్స్ వచ్చాయి. ఆ సినిమా విడుదల కోసం అందరితో పాటు నేనూ వెయిటింగ్.అలాగే బాలయ్యతో బాబీ దర్శకత్వంలో వస్తున్న సినిమాలో, బాబీడియోల్‌తో గోపీచంద్ రూపొందిస్తున్న సినిమాలో మంచి రోల్స్ లభించాయి. త్వరలో హాట్‌స్టార్‌లో 'హరి కథ' అనే వెబ్ సీరిస్ ద్వారా వస్తున్నా. 'లంబసింగి' చిత్రం తర్వాత సోలో క్యారెక్టర్లు చాలా వస్తున్నాయి. స్వామి బ్లెస్సింగ్స్‌తో మంచి మంచి పాత్రలొస్తున్నాయి.

ఆరవ తరగతిలో ఉన్నప్పుడు మొదటిసారి వచ్చా

నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడు మొదటిసారి ఫ్యామిలీతో తిరుమలకు వచ్చా. స్వామిని దర్శించుకున్నప్పుడు చెప్పలేని సంతోషం కలిగింది.అప్పుడే నిర్ణయించుకున్నా. ఏడాదికి ఓసారైనా తిరుమలకు రావాలని. ఆ స్టేజ్ నుంచి ఇప్పుడు నెలకోసారి కచ్చితంగా రావాలనే వరకూ వెళ్లిపోయా. కాలేజీ రోజుల్లో సినిమాల్లో యాక్టర్లను చూసి నేను యాక్టర్ కావాలని కోరుకుంటే స్వామి నిజంగానే చేసేశాడు. ఇక్కడికి వచ్చి వెళితే చాలాచాలా పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. మనకు కావాల్సినవన్నీ జరిగిపోతాయ్. అలా నిలబడి వెళ్లిపోతే చాలు మంచి జరుగుతుంది. ముఖ్యంగా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిలోనూ భక్తి ఉండాలి. అప్పుడే మనం సంతోషంగా, సేఫ్‌గా ఉంటాం. అందుకే కుటుంబ సభ్యులతోనే కాకుండా నా స్నేహితులు, బంధువులతో కుదిరినప్పుడల్లా తిరుమలకు వచ్చేస్తుంటా.

హాలీవుడ్‌లో నటించాలన్నదే నా డ్రీమ్

తెలుగులో మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు హాలీవుడ్‌లో నటించాలన్నది నా కల. కెరీర్ మొదట్లోనే మైక్రోసాఫ్ట్ యాడ్‌లో నటించా. అస్కార్ విన్నర్ రాబర్ట్ రిచర్డ్‌తో నటించా. అలాగే ఇటలీలో 'ది ఈక్వలైజర్3'కి ఆడిషన్ ఇచ్చా. ఎప్పటికైనా హాలీవుడ్‌లో నటించాలని వుంది.

పండగలా గ్రామసభలు

ఎట్టకేలకు ప్రాధాన్యత దక్కడంతో సర్పంచులు, ఎంపీటీసీల సంబరం



పాకాల మండలం కె.వడ్డేపల్లె సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాని



ఓజిలిలో వైసీపీ ఉప సర్పంచ్, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలు, ఉపాధి హామీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన గ్రామసభలు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగాయి. మెజారిటీ సభలకు వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికైన మూడున్నరేళ్ళ తర్వాత ఎట్టకేలకు గ్రామ సభల వేదికలపై తమకు ప్రాధాన్యత, గుర్తింపు దక్కడంతో సర్పంచులు, ఎంపీటీసీల సంబరానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ఇన్నాళ్లూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమపథకాల లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లదే కీలక పాత్రగా వుండేది. దీంతో గ్రామీణ ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే గ్రామసభల నిర్వహణకు శ్రీకారం చుట్టడం, గ్రామస్తులంతా కలసి అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసే అవకాశం కల్పించింది. శుక్రవారం జరిగిన గ్రామసభల్లో సర్పంచులు, ఎంపీటీసీల ప్రాధాన్యత కొట్టొచ్చినట్టు కనిపించింది. దీనికి తోడు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా రావడం, అంతా కలసికట్టుగా చర్చించి అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకోవడం గ్రామాల్లో కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టినట్టయింది.



ఎంతో ప్రయోజనకరం

గ్రామసభల నిర్వహణ ఎంతో ప్రయోజకరం. ఇన్నాళ్లూ వైసీపీ సర్పంచుగా వున్నా గ్రామంలో సమస్యలు పరిష్కరించే అవకాశం లభించలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏ గ్రామంలో సమస్యలను అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి అంచనాలు రూపొందించడం అభినందనీయం.

- నాగమణి, బసవయ్యపాలెం సర్పంచు,తొట్టంబేడు మండలం

సత్యవేడు, ఓజిలి మండలాల్లో వైసీపీ తీరుతో రద్దు

సత్యవేడు మండలం చెరివి గ్రామసభను వైసీపీ ఎంపీటీసీ రామయ్య అడ్డుకున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా సభ ఎలా పెట్టారని కార్యదర్శి ప్రకాష్‌పై విరుచుకుపడ్డారు. కార్యదర్శి చేత మినిట్స్ రాయించి మరీ సభను రద్దు చేయించారు. ఓజిలి మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ వాగ్వాదం తలెత్తి సభ అర్ధాంతరంగా నిలిచిపోయింది. టీడీపీ నాయకులు తాగునీటి సమస్యను ప్రస్తావించడంతో వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ సుబ్బారావు వాదులాటకు దిగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కోట మండలం చెందోడు గ్రామసభలో ఉపాధి హామీ కూలీలు తమ పేర్లు తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.కోట సచివాలయంలో పంచాయతీ దుకాణాల వేలానికి సంబంధించి టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదాలు,తోపులాటలు చోటుచేసుకున్నాయి.

మెజారిటీ గ్రామసభలకు వైసీపీ ప్రజాప్రతినిధులు

జిల్లావ్యాప్తంగా మెజారిటీ గ్రామసభలకు వైసీపీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఉదాహరణకు నాయుడుపేట మండలం తిమ్మాజీ కండ్రిగ గ్రామసభకు వైసీపీ సర్పంచ్ నల్లారి ప్రకాశం హాజరయ్యారు. ఇతర పార్టీల నాయకులూ పాల్గొన్నారు. రూ. 10 లక్షలు మంజూరు కాగా అందులో రూ. 5 లక్షలకు సీసీ రోడ్లు, రూ.5లక్షలకు డ్రైనేజీ కాలువలు నిర్మించేలా ప్రతిపాదనలు ఏకగ్రీవంగా చేశారు. సభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అందరినీ ఒకచోట చేర్చి మంజూరైన నిధుల గురించి తెలియజేసి చర్చించాక నిర్ణయాలు తీసుకోవడం చాలా బాగుందన్నారు.తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం గ్రామసభకు వైసీపీ సర్పంచ్ నాగమణితో పాటు ఆ పార్టీ కార్యకర్తలు వచ్చారు. సభ నిర్వహణ తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఏర్పేడు గ్రామసభకు వైసీపీ నేత, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య పాల్గొన్నారు.కలెక్టర్ వెంకటేశ్వర్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్న నారాయణవనం గ్రామసభకు వైసీపీ నేతలు గైర్హాజరైనప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలు మాత్రం ఉత్సాహంగా తరలివచ్చారు. గ్రామసభ రోజే ఓజిలి మండలం చిల్లమానుచేను వైసీపీ సర్పంచ్ సాయిరామ్ పార్టీకి రాజీనామా చేశారు.

శ్రీకాళహస్తి కళాకారుడికి అరుదైన అవకాశం



గురు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 23: శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ కళాకారుడు,శిల్పగురు అవార్డు గ్రహీత గురు శ్రీనివాసులుకు అరుదైన అవకాశం లభించింది. ప్యారిస్‌లో పారా ఒలంపిక్స్ ముగింపు సంబరాల్లో ఆయన పాల్గొననున్నారు. అక్కడ కలంకారీ ప్రదర్శనకు భారత ప్రభుత్వం తరపున ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు ప్యారిస్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటానని చెప్పారు.

రుయాలో జూడాల నిరసన తాత్కాలిక వాయిదా

● స్విమ్స్‌లో కొనసాగింపు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23: కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారంపై రెండువారాల్లో నివేదికలు అందించాలని, బాధ్యులను శిక్షిస్తామని సుప్రీంకోర్టు చెప్పడంతో దేశ వ్యాప్తంగా పది రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు (జూడాలు) కొంత శాంతించారు. ఇందులో భాగంగా రుయాస్పత్రిలో చేపట్టిన నిరసన కార్యక్రమాలను శుక్రవారం తాత్కాలికంగా ఆపారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అమీరున్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టుపై నమ్మకం ఉందని, రెండు వారాలపాటు నిరసనను నిలిపి వేస్తున్నామన్నారు. ఆ తర్వాత పరిణామాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. కాగా, స్విమ్స్‌లో మాత్రం ఆర్‌డీఎస్‌ఏ ఆధ్వర్యంలో శుక్రవారం కూడా నిరసనను కొనసాగించారు. ఈ నిరసన కార్యక్రమం ప్రధానంగా స్విమ్స్‌లో డాక్టర్లకు సంబంధించిన రక్షణ, వసతుల కల్పనకు సంబంధించి కొనసాగింది. ఆర్‌డీఎస్‌ఏ నేతలు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన మాటపై తమకు నమ్మకం ఉందని చెప్పారు.అయితే కోల్‌కతాలో ప్రభుత్వం మాత్రం నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తూనే ఉండటంతో.. మరింత స్పష్టత వచ్చే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు.



నిరసన శిబిరంలో జూనియర్ డాక్టర్లు



10 కిలోల గంజాయి పట్టివేత

తడ, ఆగస్టు 23:తడ మండలంలోని సరిహద్దు చెక్ పోస్టు బీవీపాలెం వద్ద శుక్రవారం తెల్లవారుజామున 10 కిలోల గంజాయి పట్టుబడింది.నెల్లూరు నుంచి చెన్నైకి తమిళనాడు బస్సులో గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని సెబ్ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు.వీరిని తమిళనాడుకు చెందిన కుమార్ నరేష్, వెట్టిప్పన్ రాజదురై, గోపి రంజిత్ కుమార్‌గా గుర్తించి విచారించారు. వైజాగ్ నుంచి రైల్లో నెల్లూరు దాకా వేరే వ్యక్తులు తెచ్చివ్వగా నెల్లూరు నుంచి తాము తీసుకొస్తున్నట్లు వారు చెప్పారు.

సీఎంఏ ఫలితాల్లో ప్రతిభ

మాస్టర్ మైండ్స్ విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్





కె.తేజస్విని - వై.వర్షితరెడ్డి - చందన

తిరుపతి(విద్య), ఆగస్టు 23: తిరుపతి మాస్టర్ మైండ్స్ విద్యార్థులు సీఎంఏ ఫలితాల్లో జాతీయ స్థాయి ప్రథమ ర్యాంకుతోపాటు 19, 34 ర్యాంకులు సాధించి రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని అడ్మిన్ ప్రిన్సిపాల్ టి. ప్రసాద్‌రావు తెలిపారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థిని కె.తేజస్విని ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారన్నారు. వై.వర్షితరెడ్డి ఆలిండియా 19వ ర్యాంకు, చందనకు 34వ ర్యాంకు వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సహకరించిన అధ్యాపకులను అడ్మిన్ ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎనిమిదిమంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 33 దుంగలు, కారు స్వాధీనం

మంగళం, ఆగస్టు 23: అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 8మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 33 దుంగలను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.గురువారం రెండు బృందాలు అన్నమయ్య జిల్లా బాలపల్లి, భాకరాపేట అటవీప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు.ఆర్ఎస్ఐ కె.అల్లీబాషా బృందం స్థానిక అటవీఅధికారులతో కలిసి శుక్రవారం ఉదయం రాజంపేట డివిజన్ బాలపల్లి బీట్ పరిధిలో దాట్లు సమీపానికి చేరుకోగా కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకెళుతూ కనిపించారు.వీరిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారు.. తమిళనాడు కళ్లకురిచి జిల్లాకు చెందిన చంద్రశేఖర్(22), శంకర్(29), వెంగటేశన్(34), ఎంజీఆర్(46), లక్ష్మణ్(57), సెల్వరసు(21)గా గుర్తించారు. సంఘటనా స్థలం నుంచి 25ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆర్ఎస్ఐ కేఏస్ లింగాధర్ బృందం చంద్రగిరివైపు అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. కల్యాణిడ్యాం నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేశారు. భాకరాపేట రేంజి, నాగపట్ల సెక్షన్ పరిధిలోని నరసింగాపురం రైల్వే బ్రిడ్జి కింద కొందరు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు.పట్టుకునే ప్రయత్నం చేయగా కారులో వెళ్లిపోయారు. లింగాధర్ టీం బైక్‌లపై వెంటాడి చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద అడ్డుకుని కారులోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వే బ్రిడ్జి కింద వారు వదలి వెళ్లిన మరో ఎర్రచందనం దుంగను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరినీ తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన హరిస్టాటిల్ రవి(30), రంజిత్ చిన్న పయ్యన్(30)గా గుర్తించారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వివాహమైన 13 రోజులకే..

● గుండెపోటుతో యువకుడి మృతి
● అలిపిరి నడకమార్గంలో ఘటన



నరేష్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వివాహమైన 13 రోజులకే ఓ యువకుడు అలిపిరి కాలినడక మార్గంలో గుండెపోటుతో మృతిచెందాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని తిరుత్తణికి సమీపంలో ఉన్న కీసలంకు చెందిన నరేష్(32) బెంగళూరులో స్థిరపడ్డాడు. అక్కడి వైట్‌ఫీల్డ్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 11వ తేదీన స్వాతి అనే యువతితో వివాహమైంది. ఈక్రమంలో తిరుమలేశుడి ఆశీస్సుల కోసం భార్యతోపాటు తన తల్లిదండ్రులు, అత్తమామలు ఇలా దాదాపు 20 మంది కుటుంబీకులతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులందరినీ వాహనాల్లోనే తిరుమలకు వెళ్లమని చెప్పాడు. తాను మాత్రం మొక్కు ఉందని అత్త కుమారుడితో కలిసి మధ్యాహ్నం 12.30 గంటలకు అలిపిరి నుంచి కాలినడక ప్రారంభించాడు. అప్పటివరకు బాగానే ఉన్న నరేష్.. 2,300 మెట్టు వద్దకొచ్చేసరికి ఛాతీ పట్టుకుని కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న బంధువు, భక్తులు పైకి లేపే ప్రయత్నం చేశారు. మరోవైపు అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియడంతో వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

టంగుటూరికి ఘన నివాళి



నాయుడుపేటటౌన్, ఆగస్టు 23 : ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని నాయుడుపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు అన్నారు. శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశంపంతులు నాయుడుపేటలోని జనరల్ స్కూల్‌లో విద్యను అభ్యసించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జి. వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, గోవర్ధన్, గురవయ్య, సుధీర్, భవానీ, శైలజ, శోభా, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు పూర్తి భద్రత కల్పించాలి

నాయుడుపేట, ఆగస్టు 23 : పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు పూర్తి భద్రత కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు శివకవి ముకుంద అన్నారు. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో శుక్రవారం సీఐటీయూ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు జిల్లాకార్యవర్గ సభ్యులు పి. మునిరాజ మాట్లాడుతూ అచ్యుతాపురం ఎసెన్షియల్ కంపెనీలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదంలో 18 మంది కార్మికులు మృతి చెందడం, దాదాపు 50మంది క్షతగాత్రులుపాలవడం విచారకరమన్నారు. అందుకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీహెచ్ రమణయ్య, సుబ్రహ్మణ్యం, అల్లెయ్య, మణెమ్మ ఉన్నారు.

కేజీబీవీ పాఠశాలలో అధికారుల తనిఖీ

తడ, ఆగస్టు 23: తడ వద్దనున్న కేజీబీవీ పాఠశాలను శుక్రవారం జిల్లా సమగ్ర శిక్షా అధికారి సురేష్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేసి వసతుల గురించి అడిగి తెలుసుకొన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి రాజమ్మ విద్యార్థినుల భద్రతపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి మెను ప్రకారం భోజనాలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి శ్రీధర్, ప్రత్యామ్నాయ పాఠశాల కోఆర్డినేటర్ పుష్పమ్మ, విద్యాశాఖాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతం



సూళ్లూరుపేట, ఆగస్టు 23: చెంగాళమ్మ ఆలయంలో శ్రావణమాస మూడో శుక్రవారం పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. ముందుగా ఉభయ దాతలచే పూజా సామగ్రిని అమ్మవారి చెంతకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్థాన మండపంలో కొలువుదీర్చిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్దకు తీసుకొచ్చి సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు చేశారు. చిట్టేటి పెరుమాల్, కర్లపూడి సురేష్, భాస్కర ఆచ్చారి, దర్శి శ్రీనివాసరావు దంపతలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వీరికి ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు ఆలయ మర్యాదలు అందజేశారు.

సెలవుదినాల్లో క్లాసులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

నాయుడుపేట, ఆగస్టు 23 : ప్రభుత్వ సెలవుదినాల్లో ప్రైవేట్ పాఠశాలలు క్లాసులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చందు అన్నారు. ఎంఈవో మునిరత్నంకు శుక్రవారం ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ ఉండాలని, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఉండాలని కోరారు. ఏబీవీపీ నాయకులు భరత్, తులసీ, గణేష్ ఉన్నారు.

ఓజిలి పాఠశాలలో గ్యాస్ సిలిండర్ లీక్

ఓజిలి, ఆగస్టు 23 : ఓజిలిలోని ఎలిమెంటరీ (ఏడబ్ల్యూ) పాఠశాలలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. దీంతో స్టౌవ్‌పై గుడ్లు ఉడకపెడుతున్న నిర్వాహకురాలు అప్రమత్తంగా వ్యవహరించి బయటకు వచ్చివేయడంతో పెద్దప్రమాదం తప్పిపోయింది. మంటలు వ్యాపించి గది పొగతో నిండిపోయింది. ఉపాధ్యాయిని రవికుమారి, నారాయణలు 100కు డైల్ చేయడంతోపాటు ఎంఈఓ శైలజకు కూడా సమాచారం అందించారు. ఓజిలి ఎస్‌ఐ రవిబాబు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఓ యువకుడి సాయంతో మంటలను అదుపుచేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడారు.

వైసీపీని వీడిన చిల్లమానుచేను సర్పంచ్

ఓజిలి, ఆగస్టు 23 : ఓజిలి మండలం చిల్లమానుచేను సర్పంచ్ పారిచర్ల సాయిరామ్ వైసీపీని వీడినట్లు శుక్రవారం తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతోనే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. చిల్లమానుచేను పంచాయతీ అభివృద్ధిలో తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. తాను ఏపార్టీలోనూ చేరడంలేదన్నారు.

నిమ్మకాయల అలంకరణలో పోలేరమ్మ



నాయుడుపేట టౌన్, ఆగస్టు 23 : పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామ దేవత పోలేరమ్మ నిమ్మకాయల అలంకరణలో దర్శనమిచ్చారు. మూడవ శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. అలాగే పట్టణంలోని మానసాదేవి, అంకమ్మ, మూకాంబికాదేవి, కన్యకాపరమేశ్వరి, దుర్గాదేవి ఆలయాలలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి కుంభాభిషేక వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 23: సూళ్లూరుపేట పట్టణం మన్నారుపోలూరులోని సత్యా జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి 28 వరకు కుంభాభిషేక వేడుకలు జరగనున్నాయి. 25న ఆదివారం సాయంత్రం ఆచార్యవరణం, మత్సంగ్రహణం, అంకురార్పణతో ఈ వేడుకలు మొదలుకానున్నాయి. 26న యాగశాలవాస్తు, అకల్మషహోమం, రక్షాబంధనం, అష్టబంధన సమర్పణ, అగ్నిప్రతిష్ఠ, 27న అధివాసాలు, మహాశాంతి హోమం, తిరుమంజనంతోపాటు విశేష హోమాలు జరుగనునున్నాయి. 28న యాత్రదానం, కుంభ ప్రదక్షిణ, కళావాహన, ఆరాధన, బ్రహ్మఘోష, ధ్వజారోహణం, రాత్రి కల్యాణోత్సవం, తిరువీధి ఉత్సవం వైభవంగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

నాయుడుపేట, ఆగస్టు 23 : గురుకుల పాఠశాల నిర్వహణ సక్రమంగా ఉండాలని తహసీల్దారు గీతావాణి అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇటీవల గురుకుల పాఠశాలను దాదాపు 56 లక్షల రూపాయలతో మరమ్మతులు చేసిన పనులను చూశారు. తరగతి గదులను, వసతి గదులను, లైబ్రరీలను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే వంటకాలు నాణ్యతతో ఉండాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర, అధ్యాపకులు మల్లికార్జున్‌రావు, నాగేశ్వరరావు, విజయభాస్కర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

సూళ్లూరుపేట, ఆగస్టు 23: తడలోని బాలుర ఉన్నత పాఠశాలకు నిప్పో పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం కంప్యూటర్లను అందజేశారు. నిప్పో పరిశ్రమ ఎండీ పొట్టిపాటి ద్వారకానాథ్ రెడ్డి సౌజన్యంతో సుమారు రూ.2 లక్షల విలువ చేసే కంప్యూటర్లను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ మురళి మోహన్, ఉపాధ్యాయులు చెంగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



కోట, ఆగస్టు 23 : మండల పరిధిలోని మైక్రో టవర్ కాలనీ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో స్కూటరిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. తిన్నెలపూడి గ్రామానికి చెందిన మధు బైక్‌లో గూడూరు నుంచి కోట వైపు వస్తున్నాడు. ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు ఊనుగుంటపాళెంలో కార్మికులను దించేసి మైక్రోటవర్ మలుపువద్ద రోడ్డు ఎక్కుతుండగా బైక్, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్కూటరిస్టు మధు తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం గూడూరుకు పంపగా ఆయన పరిస్థితి విషమంగా ఉండగా చెన్నైకు తరలించారు.

పాలనలో పారదర్శకతకే గ్రామసభలు

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డక్కిలిలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణి

బాలాయపల్లి,ఆగస్టు 23: పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని నిండలి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ ఇలాంటి సభలు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు లేకుండా జగన్మోహన్ రెడ్డి చప్పట్లు కొట్టించుకుని పోయాడన్నారు. మన ప్రభుత్వంలో డబ్బులు లేకపోయినా అనుభవపూర్వకంగా మన ముఖ్య మంత్రి పరిపాలన సాగిస్తున్నారన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాద్, ఎంపీడీవో వినీల్‌కుమార్, సర్పంచ్ యల్లంటి కృష్ణయ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డక్కిలి : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవడంతోపాటు గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ గ్రామ సభలు ఎంతగానో దోహదపడతాయని డీఎల్‌డీవో వాణి అన్నారు. శుక్రవారం డక్కిలిలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ ప్రజా అవసరాలకు సంబంధించిన పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనుల నిర్వహణలో అవకతవకలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. దగ్గవోలు, చాపలపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఎంపీపీ గోను రాజశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏపీవో లక్ష్మీనారాయణ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు : మండలవ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు. పెళ్లకూరు మండలంలో గ్రామసభలను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో విజయవంతంగా ముగించారు. తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, ఎంపీడీవో సురేష్ బాబు, ఏవో ప్రవీణ, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీషాణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచులు కందమూడి శివకుమార్, నాగేంద్రప్రసాద్రెడ్డి, కేవీనాయుడు పాల్గొన్నారు.

రసాభాసగా ఓజిలి గ్రామసభ

● నీటి సమస్యపై వాగ్వాదంతో అర్ధాంతరంగా ముగిసిన సభ

ఓజిలి, ఆగస్టు 23 : ఓజిలిలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో తాగు నీటి సమస్యపై ఉపసర్పంచి ముమ్మడి సుబ్బారావు, టీడీపీ నాయకుల మధ్య చోటుచేసుకున్న వివాదంతో సభ అర్ధాంతరంగా ముగిసింది. ఓజిలి చెరువు కట్టకు సమీపంలోని శివాలయం వద్ద నుంచి గ్రామంలోకి ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైను వివాదంగా మారడంతో నెలరోజులుగా దానికి మరమ్మతులు చేయక తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై గ్రామ సభలో టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, నాయకులు మల్లిరెడ్డి, ఫ్రాంక్లిన్‌లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఉపసర్పంచి సుబ్బారావు కల్పించుకుని మాట్లాడటంతో టీడీపీ నాయకులు, వైసీపీ నాయకుల మధ్య వాదనలు జరిగాయి. వెంటనే గ్రామసభ ప్రత్యేకాధికారి శైలజ పరిస్థితిని ఎంపీడీఓ రజనీకాంత్‌కు తెలియజేశారు. గ్రామ సభకు హాజరైన పలువురు ఒక్కొక్కరుగా వెళ్ళిపోవడంతో గ్రామసభ అర్ధాంతరంగా ముగిసిపోయింది. ఓజిలి మండలానికి రూ.కోటి 40 లక్షలు మంజూరయ్యాయని ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనను ఈ నిధులు వినియోగిస్తామన్నారు.

వాకాడు : మండలంలోని అన్ని పంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు ఆయా పంచాయతీల టీడీపీ నాయకులు, సర్పంచులు, అధికారులతో కలసి విజయవంతం చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగరాజు,టీడీపీ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి

పేదరిక నిర్మూలనకు కృషి : ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, ఆగస్టు 23 : సూళ్లూరుపేట నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. దొరవారిసత్రం మండలం వెదురుపట్టులో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధికి రెండు కోట్లు రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో రఘురామయ్య, ఏడీఏ అనిత, ఇతర శాఖల అధికారులతోపాటు మండల టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెదురుపట్టు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ : మండలంలోని 18 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. శుక్రవారం తిమ్మాజికండ్రిగలో గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి మంజూరైన రూ.10 లక్షల్లో రూ. 5లక్షలు సీసీ రోడ్లకు, రూ.5 లక్షలు డ్రైనేజీ కాలువలకు వెచ్చించే విధంగా గ్రామసభలో తీర్మానించినట్లు ఈవోపీఆర్‌డీ గోపాల్ తెలిపారు. సర్పంచ్ నల్లూరు ప్రకాష్, మాజీ సర్పంచ్‌లు లోడారి మనోహరయ్య, పిల్లేటి రమణయ్య, కార్యదర్శి కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : మండల పరిధిలోని కుదిరి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గ్రామ సభలో అందరూ కలిసి గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకొనేందుకు మంచి అవకాశమన్నారు. అన్ని పంచాయతీల్లో నాయకులు, ప్రజలు విచ్చేసి గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులపై చర్చించుకొని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసుకొన్నారు. టీడీపీ నాయకులు కె.శంకరయ్య, సుబ్రమణ్యం, పి.వెంకటసుబ్బయ్య, మురళిరెడ్డి, తిరుమలరావు, కృష్ణయ్య, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు. తడ మండలంలో అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు విజయవంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఆయా గ్రామాల్లో గ్రామ సభల ద్వారా అభివృద్ధి పనుల చేసుకొనేందుకు చర్చించుకొని తీర్మాణం చేశారు.

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలంలో గ్రామ సభలు మొక్కుబడిగానిర్వహించారు. వెదురుపట్టు పంచాయతీలో మాత్రం ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొనడంతో అధికారులంతా అక్కడ పాల్గొన్నారు.

గ్రామసభలతో గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే పాశిం

చిల్లకూరు, ఆగస్టు 23: గ్రామసభల ద్వారా గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వరగలి, మోమిడి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి పనులతో గ్రామాలను అభివృద్ధి పరచడంతోపాటు కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో ఇంటి కొళాయి, మరుగుదొడ్లు, వీధిదీపాలు, గ్యాస్‌కనెక్షన్, మినీగోకులాలు ఏర్పాటు చేస్తామన్నారు. తీరప్రాంతాల్లో పేదలకు సిలికా భూములు లేవని, సిలికా గనుల్లో పనోళ్లుగా ఉన్నారన్నారు. అధికారులు సర్వే చేసి పేదలకు చెందిన భూములను పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, శంకరయ్య, సర్పంచు మాధవి, జడ్పీటీసీ శీనయ్య, ఎంపీటీసీ కోటేశ్వరరావు, ప్రవీణ్‌రెడ్డి, చిరంజీవి, మునిశేఖర్, వెంకటేశ్వర్లునాయుడు, వెంకటకృష్ణయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, పలుశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

పనులకు వస్తున్నా పేర్లు తీసేశారు...

● గ్రామసభలో గందరగోళం

కోట, ఆగస్టు 23 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం పనులకు క్రమం తప్పకుండా వెళ్లినా తమపేర్లు తీసేశారంటూ కూలీలు చెందోడు గ్రామసభలో శుక్రవారం అధికారులకు మొరపెట్టుకున్నారు. అందుకు స్పందించిన ప్రత్యేక అధికారి జయజయరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధి పనులకు పిలుస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చెందోడు పంచాయతీకి అవసరమైన 5 పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేవిధంగా తిన్నెలపూడి గ్రామసభలో పంచాయతీలో వైసీపీ హయాంలో కొన్నిచోట్ల సొంత నిధులతో వీధి లైట్లు వేయించానని టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి స్థానిక సర్పంచ్‌తో వాదోపవాదం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంతో తనకు తెలియకుండా నిర్ణయం తీసుకున్నారని సర్పంచ్ అడగగా అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎమ్మెల్యే సహకారంతో తీసుకున్నామని సుష్మారెడ్డి బదులివ్వడంతో సభలో గందరగోళం పరిస్థితి సద్దుమణిగింది. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి రత్నయ్య ఆధ్వర్యంలో పంచాయతీకి సంబంధించిన 5 పనులను ఇంటర్నల్ రోడ్ల కింద గుర్తించారు. అదే విధంగా కోట సచివాలయంలో పంచాయతీ దుకాణాల వేలానికి సంబంధించి టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగి తోపులాట దశకు చేరుకున్నాయి. తహసీల్దారు జయజయరావు జోక్యంతో గ్రామసభ ప్రశాంతంగా జరిగింది. అదేవిధంగా మండలంలోని 21 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించారు. ఆయా గ్రామసభల్లో ఎంపీడీవో భవానీ, పలువురు మండలస్థాయి అధికారులు ఉన్నారు.



గత ప్రభుత్వంలో ఉపాధి పనులకు వెళ్లినా పేర్లు తీసేశారంటూ చెందోడు గ్రామసభలో అధికారులకు విన్నవించుకుంటున్న గ్రామస్తులు

భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 23: అంతరిక్షంలో మన శాస్త్రవేత్తలు సాధిస్తున్న విజయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో అంతరిక్ష విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువతరం శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయిలకు ఎదగాలన్నారు. షార్ పూర్వ శాస్త్రవేత్త విశ్వనాథశర్మ మాట్లాడుతూ గతంలో విదేశాల సహకారంతో అంతరిక్ష ప్రయోగాలు చేసే స్థాయి నుంచి ప్రస్తుతం విదేశాల అంతరిక్ష ప్రయోగాలకు భారత్ సహకారం అందించే స్థాయికి ఎదిగిందన్నారు. భారతప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయిసూరి మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అయిన రోజును భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. అనంతరం పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాధవి, డాక్టర్ మెహర్‌మణి, విద్యాసాగర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 23: పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల్లో ప్రమాదాల శాతం పెరుగుతుండడంతో కార్మికులు మృతిచెందడంతోపాటు క్షతగాత్రులు అవుతున్నారన్నారు. దీంతో వారి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బీవీరమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, శంకరయ్య, రమణయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 23: అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా శ్రామిక మహిళా నాయకురాలు లక్ష్మమ్మ మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో భద్రత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. సెజ్‌ల్లో స్థాపించే కంపెనీల ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడం బిజినెస్‌ల పేరుతో హడావిడిగా కంపెనీలకు అనుమతులు ఇవ్వడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కంపెనీల్లో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసి భద్రత ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అల్లెయ్య, పద్మనాభం, లక్ష్మయ్య, రమణయ్య, రాజేష్, గజేంద్ర, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్వాయిపాడు పాఠశాలలో ఘనంగా స్పేస్ డే

పెళ్లకూరు, ఆగస్టు 23 : మండలంలోని తాళ్వాయిపాడు ఉన్నత పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని(స్పేస్) ఘనంగా జరుపు కొన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యా యురాలు స్వరూపకుమారి సైన్స్ ప్రాధా న్యత, గొప్పతనం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు పలు విధాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. అదేవిధంగా పలు ఆటల పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.



సీవీ రామన్ చిత్రపటానికి నివాళి

రక్తదానం ప్రాణదానంతో సమానం

గూడూరు, ఆగస్టు 23: రక్తదానం ప్రాణదానంతో సమానమని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రమాదాలకు లోనైన వారికి ప్రాణదానం చేసిన వారమవుతామన్నారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యశోవర్ధన్, విశ్వక్సేనారెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జూనియర్ టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, ఆగస్టు 23: స్థానిక ఏపీ రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్ జట్లును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా టెన్నికాయిట్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ సబ్‌జూనియర్ బాలబాలికల విభాగంలో జిల్లాజట్టును ఎంపిక చేశారన్నారు. ఎంపికైన జట్టు సభ్యులకు కోచ్‌లచే శిక్షణ అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్, మల్లికార్జున, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

శిశువును తిరుపతి శిశు గృహానికి తరలింపు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 23 : తిమ్మాజికండ్రిగ- జోశ్యులవారికండ్రిగ మార్గ మధ్యలో గురువారం రోడ్డుపై వదిలేసిన పురిటి శిశువుని నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేయడంతో ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ మోహన్‌సాయి, రూప, డాక్టర్ సాయిప్రియ తెలిపారు. శిశువును సీడీపీవో ఉమామహేశ్వరికి శుక్రవారం అప్పగించారు. శిశువును తిరుపతి శిశు గృహానికి తరలిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు.



సీడీపీవోకి శిశువును అప్పగిస్తున్న వైద్యులు

మద్యం బాటిళ్ల ధ్వంసం

సూళ్లూరుపేట, ఆగస్టు 23: సూళ్లూరుపేట, వాకాడు పరిధిలో ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను శుక్రవారం సెబ్ అధికారులు ధ్వంసం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమేష్ ఆధ్వర్యంలో మాంబట్టు పారిశ్రామిక వాడలోని ఖాళీ ప్రదేశంలో దాదాపు 14,201 మద్యం బాటిళ్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేసి పూడ్చినట్లు సెబ్ అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, వాకాడు సెబ్ సీఐలు సోమయ్య, శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లమానుచేను పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం



ఓజిలి, ఆగస్టు 23 : ఓజిలి మండలం చిల్లమానుచేను ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం జరిగింది. విద్యార్థులు అంతరిక్షంపై వివిధ నమూనాలు తయారుచేసి ప్రదర్శనకు ఉంచారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్పి.జి4 258/2024 తేది : 18-07-2024

శ్రీయుత జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.VII

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది నిర్ధిష్టపరచిన షెడ్యూల్ దాఖలా భూములను విస్తీర్ణము ఎ.3.82 సెంట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, **పారవోలు గ్రామ పరిధిలో కి 331.8 మీ. నుండి 332.6 కి.మీ. వరకు నూతనముగా నిర్మించు నడికుడి** కావలెనని ప్రతిపాదించినందున మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తరపున శ్రీ జిల్లా కలెక్టర్, తిరుపతి జిల్లా వారు భావించినందున, ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ జిల్లా కలెక్టరు, తిరుపతి జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూమి య.24.06 సెంట్లు ప్రజాప్రయోజనమూలకై అనగా **పారవోలు గ్రామ పరిధిలో కి 331.8 మీ నుండి 332.6 కి.మీ. వరకు నూతనముగా నిర్మించు నడికుడి** కావలెనని ప్రతిపాదించినందున భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : తిరుపతి మండలము : వెంకటగిరి గ్రామము : పారవోలు

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ సబ్ డివిజన్ నంబరు	మొత్తం విస్తీర్ణం ఎ. సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెం.	భూ స్థితి	సంబంధిత ఆసామి పేరు, పట్టాదారు పేరు మరియు అనుభవదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల, వివరములు
1.	97-10 (సర్వే నెం.97-3 నుండి విభజించబడినది)	0.67	0.06	పట్టా మాగాణి	1.జడపల్లి చంద్రమౌళి తండ్రి వీరాస్వామి 2.జడపల్లి వీర రాఘవయ్య తండ్రి వెంకట్రామయ్య 3.జడపల్లి రామ రాఘవలు తండ్రి వెంకట్రామయ్య	160	97-3	97-11	97-3	
2.	97-11 (సర్వే నెం.97-8 నుండి విభజించబడినది)	0.07	0.04	A.W DRY	జడపల్లి రామ రాఘవలు	160	97-8	144	97-3	
3.	171-14 (సర్వే నెం. 171-10 నుండి విభజించబడినది) (this Sy.No. Splitted from FLR Sy.No.2	0.50	0.10	A.W DRY	టి.చెంచమ్మ భర్త భాస్కర్‌రెడ్డి	171-9	171 -15	171-10	2	
4.	171-15 (సర్వే నెం. 171-11 నుండి విభజించబడినది) (this Sy.No. Splitted from FLR Sy.No.2	0.54	0.18	A.W DRY	టి.చెంచమ్మ భర్త భాస్కర్‌రెడ్డి	171-14	172	171-11	172	
5.	171-16 (సర్వే నెం. 171-12 నుండి విభజించబడినది) (this Sy.No. Splitted from FLR Sy.No.2	1.11	0.50	A.W DRY	మేదా సుబ్బలక్ష్మి భర్త ఆదినారాయణరెడ్డి	171-12	173	171-13	172	
6.	172-8 (సర్వే నెం. 172-1 నుండి విభజించబడినది)	1.60	0.73	A.W DRY	పుల్లూరు సుగుణమ్మ భర్త క్రిష్టరెడ్డి	2	172-1	172-9	2	
7.	172-9 (సర్వే నెం. 172-2 నుండి విభజించబడినది)	0.42	0.25	A.W DRY	పుల్లూరు సుగుణమ్మ భర్త క్రిష్టరెడ్డి	171	172-2	172 -10	172 -8	
8.	172-10 (సర్వే నెం. 172-3 నుండి విభజించబడినది)	0.72	0.47	A.W DRY	పుల్లూరు సుగుణమ్మ భర్త క్రిష్టరెడ్డి	171	172-3	172 -11	172 -9	
9.	172-11 (సర్వే నెం. 172-4 నుండి విభజించబడినది)	0.41	0.31	A.W DRY	ఇతరులు	172 -16	172-4	172 -12	172 -10	
10.	172-12 (సర్వే నెం. 172-6 నుండి విభజించబడినది)	0.95	0.35	A.W DRY	మేదా సుబ్బలక్ష్మి భర్త ఆదినారాయణరెడ్డి	172 -15	172 -6	172 -13	172 -11	
11.	172-13 (సర్వే నెం. 172-7 నుండి విభజించబడినది)	0.72	0.29	A.W DRY	గంగిరెడ్డి లోశమ్మ భర్త నారాయణరెడ్డి	172 -14	172 -7	171	172 -12	
12.	173-8 (సర్వే నెం. 173-1 నుండి విభజించబడినది)	0.94	0.85	A.W DRY	గంగిరెడ్డి లోశమ్మ భర్త నారాయణరెడ్డి	171	173 -9	173 -11	172	
13.	173-9 (సర్వే నెం. 173-2 నుండి విభజించబడినది)	2.29	1.00	A.W DRY	తంబిరెడ్డి తులసమ్మ భర్త మహేంద్రరెడ్డి	173 -8	173 -2	173 -11	172	
14.	173-10 (సర్వే నెం. 173-4 నుండి విభజించబడినది)	1.51	0.70	A.W DRY	ఇతరులు	173 -11	173 -4	2	173 -9	
15.	173-11 (సర్వే నెం. 173-5 నుండి విభజించబడినది)	0.24	0.21	A.W DRY	తోట తిరుపమ్మ భర్త కోటేశ్వరరావు	173 -5	173 -10	173 -12	173 -9	
16.	173-12 (సర్వే నెం. 173 నుండి విభజించబడినది)	1.01	0.60	A.W DRY	తోట మునిరత్నం భర్త శివరాజు	172 -6	2	173 -7	173 -11	
17.	173-7	0.09	0.09	A.W DRY	ఇతరులు	174	2	142	173 -6	
18.	177-11 (సర్వే నెం. 177-6 నుండి విభజించబడినది)	0.82	0.48	A.W DRY	తోట చిన్న పోలయ్య తోట సుబ్బరామయ్య నెల్లూరు దాసు	173	177 -6	177 -7	173	
19.	177-8	3.16	3.16	A.W DRY	తోట వీర రాఘవయ్య తోట వెంకటయ్య	176	2	177 -9	177 -7	
20.	177-9	0.40	0.40	A.W DRY	తోట నాగభూషణమ్మ భర్త వెంకటయ్య	176	2	144	177 -8	
21.	160-11 (నెంబర్ సర్వే 160-1 నుండి విభజించబడినది)	0.60	0.56	A.W DRY	1.జడపల్లి రామ రాఘవలు తండ్రి వెంకట్రామయ్య 2. జడపల్లి వీరరాఘవయ్య తండ్రి వెంకట్రామయ్య	2	160 -13	160 -2	160 -10	
22.	160-2	0.44	0.44	A.W DRY	1.జడపల్లి చంద్రమౌళి తండ్రి వీరస్వామి 2. జడపల్లి వీరరాఘవయ్య తండ్రి వెంకట్రామయ్య 3. జడపల్లి రామ రాఘవలు తండ్రి వెంకట్రామయ్య	2	160 -13	144	160 -11	
23.	160-4	0.08	0.08	A.W DRY	1.జడపల్లి రామ రాఘవలు	160 -13	160 -12	160 -13	160 -13	
24.	160-12 (సర్వే నెంబర్ 160-8 నుండి విభజించబడినది)	0.08	0.03	A.W DRY	1.జడపల్లి చంద్రమౌళి	160 -4	160 -8	160 -13	160 -8	
25.	160-9	0.25	0.25	A.W DRY	1.జడపల్లి వీరరాఘవయ్య	160 -13	97	144	160 -8	బోర్ వెల్
26.	162-3 (సర్వే నెంబర్ 162-1 నుండి విభజించబడినది) (సర్వే నెం.162-1 నెంబరు 144 నుండి విభజించబడినది)	1.62	1.18	A.W DRY	బత్తినపట్ల రమాదేవి (Sy.No.144-బి వెట్ ల్యాండ్)	208	162 -1	162 -4	97	
27.	162-4 (సర్వే నెం. 162-2 నుండి (Blockspitting from Old Sy.No.144)	2.31	2.26	A.W DRY	బత్తినపట్ల రమాదేవి బత్తినపట్ల వెంకటరత్నమ్మ (Sy.No.144-బి&A వెట్‌ల్యాండ్)	162 -3	211	163	162 -3	
28.	163-3 (సర్వే నెం. 163-1 నుండి విభజించబడినది) (Blockspitting from Old Sy.No.144)	5.07	0.35	A.W DRY	బత్తినపట్ల వెంకటరత్నమ్మ (Sy.No.144- వెట్‌ల్యాండ్)	162 -1	163 -2	163 -4	162	
29.	163-4 Sub divided from S.No.163-2 (Blockspitting from Old Sy.No.144)	3.83	3.63	A.W DRY	బత్తినపట్ల రామసుబ్బారెడ్డి బత్తినపట్ల వెంకటరత్నమ్మ (Sy.No.144-C&A వెట్‌ల్యాండ్)	163 -1	163 -2	213	163 -2	
30.	164 Sub (Blockspitting from Old Sy.No.144)	4.00	4.00	A.W DRY	బి.రామ సుబ్బారెడ్డి (Sy.No.144-1 వెట్‌ల్యాండ్)	163	212	210	162	
31.	176-4 (సర్వే నెం. 176-1 నుండి విభజించబడినది)	5.30	0.03	A.W DRY	తోట పుష్పలత	176 -1	2 -1	176 -5	176	
32.	176-5 (సర్వే నెం. 176-3నుండి విభజించబడినది)	1.12	0.43	A.W DRY	తోట నాగభూషణమ్మ	176 -3	2	176 -4	2	
33.	183-7 (సర్వే నెం. 183-4 నుండి విభజించబడినది)	4.30	0.05	A.W DRY	జడపల్లి పార్వతి	183 -4	208	183 -4	209	
		మొత్తం	24.06							

పై భూముల యొక్క వివరములు భూసేకరణ కార్యాలయము, APIIC, తిరుపతి నందు అందుబాటులో ఉంచబడును. ఆసక్తి కలిగిన వ్యక్తులు కార్యాలయ పని వేళలలో హాజరై పరిశీలన చేసుకొనగలరు. ఈ భూసేకరణలో స్థానభ్రంశమునకు గురి అయిన కుటుంబాలు ఏవియును లేవని తెలుపడమైనది.

భూసేకరణ కారణంగా పునరావాసం మరియు పునరావాసం పొందే అవకాశం ఉన్న కుటుంబాల సంఖ్య ఏమి లేవు. వీరి కోసం పునరావాస ప్రాంతం గుర్తించబడింది. పునరావాస ప్రాంతం వివరాలు ఇలా ఉన్నాయి.

వరుస నెంబర్	గ్రామము పేరు	మండలము పేరు	జిల్లా పేరు	మొత్తం విస్తీర్ణం
- లేవు -				

పునరావాసం మరియు పునరావాస పథకం యొక్క సారాంశం జోడించబడినది.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే ఆటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే ఉపయోగించవలెను.

సం/- శ్రీ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, ఐ.ఏ.యస్ , జిల్లా కలెక్టరు, తిరుపతిజిల్లా

సోమశిలలో 28.496 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 16,572 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.496 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆర్పి.జి4 237/2024 తేది : 18-07-2024

శ్రీయుత జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం. 7

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది నిర్ధిష్టపరచిన షెడ్యూల్ దాఖలా భూములను విస్తీర్ణము ఎ.3.20 సెంట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, **బంగారుపేట గ్రామ పరిధిలో కి 331.8 మీ. నుండి 332.6 కి.మీ. వరకు నూతనముగా నిర్మించు నడికుడి** కావలెనని ప్రతిపాదించినందున మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తరపున శ్రీ జిల్లా కలెక్టర్, తిరుపతి జిల్లా వారు భావించినందున, ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ జిల్లా కలెక్టరు, తిరుపతి జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూమి ఎ.3.20 సెంట్లు ప్రజాప్రయోజనమూలకై అనగా **బంగారుపేట గ్రామ పరిధిలో కి 331.8 మీ. నుండి 332.6 కి.మీ. వరకు నూతనముగా నిర్మించు నడికుడి** కావలెనని ప్రతిపాదించినందున భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : తిరుపతి మండలము : వెంకటగిరి గ్రామము : బంగారుపేట

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్. డి. నెం.	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెం.	ఆసక్తి గల సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల, వివరములు
1.	51-2	2.56	1.14	శ్రీ చెన్నూరు మాలకొండయ్య తండ్రి గంగయ్య మరియు ఇతరులు	51/1 52/5	51/3	66	50/2, 50/3 52/5	
2.	55-1	1.55	0.70	1. శ్రీ అన్నివేటి వెంకట రమణయ్య 2. వద్దిగుంట రమణమ్మ	61/1 61/2	55/15	55/1 4	62/1	
3.	55-16 (Splitted from 55-2	0.47	0.20	శ్రీమతి తిరుపతి రంగమ్మ భర్త వెంకటముని	55/2 A	55/4	53/3	55/14	
4.	55-3	0.24	0.24	1.చిట్టిటి సుబ్బమ్మ 2.ఇండ్ల నరసయ్య	53/3	53/12	54/1	54/4 16/A1	
5.	55-4	0.29	0.29	1.చిట్టిటి సుబ్బమ్మ 2.ఇండ్ల నరసయ్య	55/1 6A	55/12	54/1	54/4 16/A1	
6.	55-14 (Splitted from 55-1	1.55	0.54	1.శ్రీ అన్నివేటి వెంకట రమణయ్య 2. వద్దిగుంట రమణమ్మ	61/2	61/6, 61/5 61/7	55/1 6A	55/1A	
7.	61-2	0.39	0.02	శ్రీమతి తిరుపతి రంగమ్మ భర్త వెంకటముని	కలపాడు గ్రామము	61/6 61/5	62/1	కలపాడు గ్రామము	
8.	61-4	0.07	0.07	శ్రీమతి తిరుపతి రంగమ్మ భర్త వెంకటముని	కలపాడు గ్రామము	61/6 61/5	62/1	కలపాడు గ్రామము	
	మొత్తం		3.20						

పై భూముల యొక్క వివరములు భూసేకరణ కార్యాలయము, APIIC, తిరుపతి నందు అందుబాటులో ఉంచబడును. ఆసక్తి కలిగిన వ్యక్తులు కార్యాలయ పని వేళలలో హాజరై పరిశీలన చేసుకొనగలరు. ఈ భూసేకరణలో స్థానభ్రంశమునకు గురి అయిన కుటుంబాలు ఏవియును లేవని తెలుపడమైనది.

భూసేకరణ కారణంగా పునరావాసం మరియు పునరావాసం పొందే అవకాశం ఉన్న కుటుంబాల సంఖ్య ఏమి లేవు. వీరి కోసం పునరావాస ప్రాంతం గుర్తించబడింది. పునరావాస ప్రాంతం వివరాలు ఇలా ఉన్నాయి.

వరుస నెంబర్	గ్రామము పేరు	మండలము పేరు	జిల్లా పేరు	మొత్తం విస్తీర్ణం
- లేవు -				

పునరావాసం మరియు పునరావాస పథకం యొక్క సారాంశం జోడించబడినది.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే ఆటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే ఉపయోగించవలెను.

సం/- శ్రీ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, ఐఏయస్ , జిల్లా కలెక్టరు, తిరుపతి జిల్లా

ఆంధ్రకేసరి బహుముఖ ప్రజ్ఞాశాలి : జేసీ

● కలెక్టరేట్‌లో ఘన నివాళి



ప్రకాశం పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 23 : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి అయిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యశాలి, బహుముఖ ప్రజ్ఞా శాలి అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లా సహకారశాఖాధికారి కార్యాలయంలో ప్రకాశం పంతులు విగ్రహానికి డీసీవో గురప్ప పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రకాశంపంతులు అత్యంత ప్రజ్ఞావంతుడని, న్యాయకోవిదుడని కొనియాడారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



స్కానింగ్ కేంద్రంలో రిపోర్టును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 23 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీ లించారు. పీసీ, పీఎన్‌డీటీ చట్టాలను అనుసరించి స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాలని సూచించారు. తప్పని సరిగా ధరల పట్టికను ప్రదర్శిం చాలని, ఎట్టి పరిస్థితిలోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని ఆదేశించారు. ఈ తనిఖీలో డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య'కు రూ.5 లక్షల విరాళం



విరాళం చెక్కును అందచేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 23 : నెల్లూరులోని జనహిత- వాత్సల్య అనాథ శరణాలయానికి నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి శుక్రవారం రూ. 5 లక్షల విరాళాన్ని అందచేశారు. వారి నివాసంలో వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు విరాళం చెక్కును అందచేశారు. సాంబశివరావు మాట్లాడుతూ 36 ఏళ్లుగా వాత్సల్య సంస్థకు వేమిరెడ్డి కుటుంబం సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు.

బైక్ పైనుంచి పడి ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 23: శకునాలపల్లి సమీపంలో శుక్రవారం మోటార్‌బైక్‌పై నుంచి పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.ఆదిలక్ష్మి జారి పడి తలకు తీవ్ర గాయపడింది. పాఠశాల విధులు ముగిసిన అనంతరం స్వగ్రామమైన కడప జిల్లా రసాయిపేటకు వెళ్లేందుకు మోటార్‌బైక్‌పై యర్రబల్లిగడ్డ సెంటర్‌కు వస్తుంది. ఈ తరుణంలో శకునాపల్లి గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గమనించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

● **ఆటో, మోటార్ బైక్ ఢీకొని..**

సున్నవారిచింతల గ్రామ సమీపంలో ఆటో, మోటార్‌బైక్ ఢీకొన్న సంఘటనలో గుడినరవ గ్రామానికి చెందిన బక్కా సుజాత గాయపడింది. ఉదయగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా గండిపాళెం నుంచి దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామానికి వెళుతున్న ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడిన సుజాతను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు..



ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యాధికారి నవీన్‌కుమార్

చేజర్ల, ఆగస్టు 23: ఆదురుపల్లి- కలువాయి ప్రధాన రహదారిలోని గోపవరం సమీపంలో వెళుతున్న ఓ కారు అదుపుతప్పి చెట్టుకు గుద్దుకుంది. ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అదే సమయంలో అటుగా 104వాహనంలో వెళ్తున్న చిత్తలూరు పీఎహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌కుమార్ అక్కడి వెళ్లి బాధితులను పరిశీలించారు. గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందజేసి 108వాహనంలో వైద్యశాలకు తరలించారు.

అప్పుల బాధతో చిరు వ్యాపారి అదృశ్యం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 23: నెల్లూరు నగరంలో ఓ చిరు వ్యాపారి అదృశ్యమైనట్లు చిన్నబజారు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కోటమిట్టలో పీ అల్లానూర్‌ఖాన్ కుటుంబం నివసిస్తోంది. ఆయన స్థానికంగా చికెన్ పకోడా బండి నిర్వహిస్తున్నాడు. వ్యాపారం, కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో అల్లానూర్‌ఖాన్ తండ్రి ఖుద్దె నూర్‌ఖాన్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్టాండులో ఒకరి మృతి

నెల్లూరు (క్రైం), ఆగస్టు 23: నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై పాచిరంగు టీషర్టు, ముదురు సిమెంట్ రంగు లోయర్ ఉన్నాయని తెలిపారు. ఇతర ఆధారాలు లభ్యం కాకపోవడం తో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు తమకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఆర్పి.జి. 4/188/2024 తేది : 18-07-2024

శ్రీయుత జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం (నమూనా) నెం. 7

విభాగము 19(1) మరియు రూలు 25 (1) మేరకు

సెక్షన్ 19(1) భూసేకరణ మరియు పునరావాస పునర్ నిర్మాణ చట్టం 2013 రూల్ 25(1) ప్రకారం సంక్రమించిన అధికారాలను అనుసరించి ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన భూములను తిరుపతి జిల్లా, దక్కిలి మండలము, కుప్పాయపాళెం గ్రామంలో వున్న ఎ.15.25 సెంట్ల భూమిని ప్రజాహిత కార్యక్రమాలకు అనగా నూతనముగా నిర్మించు నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే బి.జి.లైన్ నిర్మాణం కొరకు భూమి కావలెనని భూసేకరణ అవసరమై యున్నదని ప్రకటించుచు ఇది చట్టములోని విభాగము 15 మేరకు ఆసక్తి గల వ్యక్తులను విచారించిన పిమ్మట ఈ క్రింది షెడ్యూలులోని భూములు సేకరించుటకు జిల్లా కలెక్టర్, తిరుపతి వారు సంతృప్తి చెంది వున్నారు. మరియు రిక్వైరింగ్ బాడి అనగా రైల్వేశాఖ, డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కంట్రక్షన్) వరల్డ్ క్లాసు స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ వారు సదరు భూసేకరణకు కావలసిన నిధులు సి.యఫ్.యం.యస్., ద్వారా డిపాజిట్ చేసినట్లు తెలిపినందున ఈ క్రింది కనపరచిన షెడ్యూలు దాఖలా భూములకు డిక్లరేషన్ ఇవ్వడమైనది.

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలు నందు కనపరచిన ఎ.15.25 సెంట్ల విస్తీర్ణం గల భూములను, ప్రజా ప్రయోజిత కార్యక్రమాలకు అనగా రైల్వే శాఖ, డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కంట్రక్షన్) వరల్డ్ క్లాసు స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ ద్వారా నూతనముగా నిర్మించు నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైల్వే బి.జి.లైన్ నిర్మాణం నిమిత్తము అవసరమైనట్లు న్యాయమైన పరిహారము, పారదర్శకత, పునరావాసము మరియు పునఃస్థాపన చట్టం 2013లోని విభాగము 19(1) (కేంద్ర చట్టం 30/2013) ప్రకారము జిల్లా కలెక్టర్, తిరుపతి వారు ఇందుమూలముగా ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా : తిరుపతి మండలము : దక్కిలి గ్రామము : కుప్పాయపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ సబ్ డివిజన్ నంబరు	మొత్తం విస్తీర్ణం ఎ. సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెం.	భూ స్థితి	సంబంధిత ఆసామి పేరు, పట్టాదారు పేరు మరియు అనుభవదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల, వివరములు
1.	86-2 (సర్వే నెం.86 నుండి విభజించబడినది)	9.61	1.84	మెట్ట	పులకంటి అంకమ్మ భర్త ఈశ్వరయ్య	16	84	17	వెంబులూరు గ్రామం	దానిమ్మ-146, వేప పెద్దవి -2, వేప చిన్నవి-6, సుబాబుల్-1, బావి-1
					పులకంటి రత్నమ్మ భర్త వెంకటేశ్వర్లు	16	84	17	వెంబులూరు గ్రామం	బోరు-1
					వేముల మాధవి భర్త రవి	16	84	17	వెంబులూరు గ్రామం	తాటి పెద్దవి -3, టిరసన-1, నిమ్మ చిన్నవి-6
2.	82-3 (సర్వే నెం.82 నుండి విభజించబడినది)	0.25	0.01	మెట్ట	నీలకంటం సాలమ్మ భర్త వెంకటయ్య	83	88	88	81	బీడు
3.	83-5 (సర్వే నెం.83-1 నుండి విభజించబడినది)	0.25	0.06	మెట్ట	పులకంటి పోలయ్య తండ్రి పెంచలయ్య	84	82	88	వెల్లంపల్లి గ్రామం	బీడు
4.	83-7 (సర్వే నెం.83-3 నుండి విభజించబడినది)	0.25	0.21	మెట్ట	తంబిశెట్టి పెంచలయ్య తండ్రి పోలయ్య	84	82	88	వెల్లంపల్లి గ్రామం	బీడు
5.	88-4 (సర్వే నెం.88-2 నుండి విభజించబడినది)	3.75	3.64	మెట్ట	1) తంబిశెట్టి రామమ్మ భర్త పొట్టెయ్య 2) తిరుపతి అంకయ్య తండ్రి పెంచలయ్య 3) పులికంటి నారయ్య తండ్రి రామయ్య	85	97	89	82	బీడు
6.	96-3 (సర్వే నెం.96-1 నుండి విభజించబడినది)	9.70	0.89	మెట్ట	1) ఇలగనూరు నారమ్మ భర్త వీరయ్య 2) నీలకంటం పెదకలికయ్య 3) ఇలగనూరు చిన్న బక్కయ్య 4) ఇలగనూరు కొక్కయ్య 5) కిరీటం అల్లెయ్య 6) నీలకంటం సాలమ్మ భర్త వెంకటయ్య 7) నీలకంటం చిన కలికయ్య 8) నీలకంటం నాగేష్ 9) నీలకంటం రాజారావు 10)నీలకంటం కాటయ్య 11) నీలకంటం సుబ్బయ్య 12) గుడుగూరు పోలయ్య 13) నీలకంటం గురవయ్య 14) పులకంటి కమలమ్మ భర్త వెంకటపతి	88	98	95	97	బీడు
7.	97-4 (సర్వే నెం.97-2 నుండి విభజించబడినది)	9.50	2.18	మెట్ట	1) తంబిశెట్టి పెంచలయ్య తండ్రి పోలయ్య 2) పులకంటి పోలయ్య 3) నీలకంటం పెదమస్తాన్ 4) బోసి చిన్నయ్య తండ్రి బంగారయ్య 5) తంబిశెట్టి ఈశ్వరయ్య తండ్రి తిరుపాలయ్య 6) దేరంగుల పోలయ్య 7) దేరంగుల కాటమ్మ భర్త చిన్నయ్య 8) పులకంటి తిమ్మయ్య 9) పులకంటి వెంకటయ్య 10) నీలకంటం పెంచలమ్మ భర్త వెంకటయ్య 11) పులకంటి అంకమ్మ 12) పులకంటి పోలయ్య తండ్రి వెంకటపతి 13) పులకంటి సుబ్రహ్మణ్యం 14) తంబిశెట్టి ఈశ్వరయ్య తండ్రి బిత్తరయ్య 15) పులకంటి కమలమ్మ భర్త వెంకటపతి 16) ఇలగనూరు వెంకటమ్మ భర్త కోటయ్య 17) ఆదూరి చిన్నయ్య 18) ఇలగనూరు బుడ్డయ్య 19) యాలపల్లి ఈశ్వరయ్య	88	79	96	80	బీడు
8.	98-2 (సర్వే నెం.98 నుండి విభజించబడినది)	10.02	3.25	మెట్ట	1) ఇలగనూరు మస్తానయ్య 2) ఇలగనూరు పుల్లయ్య 3) ఇలగనూరు వెంకటయ్య 4) నావూరు చినస్వామి 5) తమ్మిశెట్టి ఈశ్వరయ్య తండ్రి కరైయ్య 6) నావూరు బక్కయ్య 7) నావూరు భీమయ్య 8) శ్రీరాం పాపయ్య 9) నల్లగుండ్ల పెద ఈశ్వరయ్య 10) శ్రీరాం ఈశ్వరయ్య 11) బండి నరసయ్య 12) పులకంటి పాపయ్య తండ్రి పెంచలయ్య 13) పులకంటి వెంకటసుబ్బయ్య 14) తంబిశెట్టి పోలయ్య తండ్రి పిచయ్య	96	77	99	79	బీడు
9.	102-3 (సర్వే నెం.102-1 నుండి విభజించబడినది)	9.70	2.27	మెట్ట	1) నీలకంటం సాలమ్మ భర్త వెంకటయ్య 2) రామాజత్తిన తిరిపాలు 3) కిరీటం అల్లెయ్య 4) నీలకంటం నగేష్ 5) నీలకంటం కోటేశ్వరరావు తండ్రి కాటయ్య 6) నీలపనేని సుబ్బరాయుడు	99	77	101	103	బీడు
10	103-1	9.70	0.90	మెట్ట	1) నీలపనేని సుబ్బారాయుడు 2) నల్లగుండ్ల గుండయ్య 3) కర్రేద్దుల పండయ్య 4) పంచేటి రామయ్య 5) జడపల్లి ఈశ్వరయ్య తండ్రి జంగయ్య 6) రామాజత్తిన తిరుపాలు 7) సద్దికూటి చిన్నయ్య 8) రామాజత్తిన ఈశ్వరయ్య 9) పంచేటి శంకరయ్య 10) నల్లగుండ్ల పెద ఈశ్వరయ్య తండ్రి పాపయ్య 11) నల్లగుండ్ల పాపయ్య 12) నీలకంటం పెదకలికయ్య	98	77	102	78	బీడు
	మొత్తము		15.25							

పై భూముల మొక్క వివరములు భూసేకరణ కార్యాలయము, APIIC తిరుపతి నందు అందుబాటులో ఉంచబడును. ఆసక్తి కలిగిన వ్యక్తులు కార్యాలయ పని వేళలలో హాజరై పరిశీలన చేసుకొనగలరు. ఈ భూసేకరణలో స్థానభ్రంశమునకు గురి అయిన కుటుంబాలు ఏవియును లేవని తెలుపడమైనది.

భూసేకరణ కారణంగా పునరావాసం మరియు పునరావాసం పొందే అవకాశం ఉన్న కుటుంబాల సంఖ్య ఏమి లేవు. వీరి కోసం పునరావాస ప్రాంతం గుర్తించబడింది. పునరావాస ప్రాంతం వివరాలు ఇలా ఉన్నాయి.

వరుస నెంబర్	గ్రామము పేరు	మండలము పేరు	జిల్లా పేరు	మొత్తం విస్తీర్ణం
- లేవు -				

పునరావాసం మరియు పునరావాస పథకం యొక్క సారాంశం జోడించబడినది.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే ఉపయోగించవలెను.

సం/- శ్రీ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, ఐ.ఏ.యస్ , జిల్లా కలెక్టరు, తిరుపతిజిల్లా

కృష్ణాష్టమి వేడుకలకు గుంజ ప్రతిష్ఠ



గుంజ ప్రతిష్ఠ కార్యక్రమంలో నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని బాలాజీ నగర్ పిండిమిల్లు సెంటర్‌లో ఈనెల 26 నుంచి నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల పనులు ప్రారంభించేందుకు శుక్రవారం గుంజ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పిండిమిల్లు సెంటర్‌లో 28 ఏళ్లుగా బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 26వతేదీ సాయంత్రం 4.38 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, 27వతేదీ ఉదయం 8గంటలకు పూజా కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు ఉట్టి మహోత్సవం, 28వతేదీ ఉదయం 11.30 గంటలకు వస్త్రదానం, రాత్రి 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 29వతేదీ మధ్యాహ్నం అన్నదానం, 30వతేదీ ఉదయం 10గంటలకు నగరోత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

ఆర్పి.జి 4/149/2024 తేది : 18-07-2024

శ్రీయుత జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం (నమూనా) నెం. 7

విభాగము 19(1) మరియు రూలు 25 (1) మేరకు

సెక్షన్ 19(1) భూసేకరణ మరియు పునరావాస పునర్ నిర్మాణ చట్టం 2013 రూల్ 25(1) ప్రకారం సంక్రమించిన అధికారాలను అనుసరించి ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన భూములను తిరుపతి జిల్లా, దక్కిలి మండలము, మాధవాయపాళెం గ్రామంలో వున్న ఎ.2.07 సెంట్ల భూమిని ప్రజాహిత కార్యక్రమాలకు అనగా నూతనముగా నిర్మించు నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే బి.జి.లైన్ నిర్మాణం కొరకు భూమి కావలెనని భూసేకరణ అవసరమైయున్నదని ప్రకటించుచు ఇదే చట్టములోని విభాగము 15 మేరకు ఆసక్తి గల వ్యక్తులను విచారించిన పిమ్మట ఈ క్రింది షెడ్యూలులోని భూములు సేకరించుటకు జిల్లా కలెక్టర్, తిరుపతి వారు సంతృప్తి చెంది వున్నారు. మరియు రిక్వైరింగ్ బాడి అనగా రైల్వేశాఖ, డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కంట్రక్షన్) వరల్డ్ క్లాసు స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ వారు సదరు భూసేకరణకు కావలసిన నిధులు సి.యఫ్.యం.యస్., ద్వారా డిపాజిట్ చేసినట్లు తెలిపినందున ఈ క్రింది కనపరచిన షెడ్యూలు దాఖలా భూములకు డిక్లరేషన్ ఇవ్వడమైనది.

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలు నందు కనపరచిన ఎ.2.07 సెంట్ల విస్తీర్ణం గల భూములను, ప్రజా ప్రయోజిత కార్యక్రమాలకు అనగా రైల్వే శాఖ, డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కంట్రక్షన్) వరల్డ్ క్లాసు స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ ద్వారా నూతనముగా నిర్మించు నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైల్వే బి.జి.లైన్ నిర్మాణం నిమిత్తము అవసరమైనట్లు న్యాయమైన పరిహారము, పారదర్శకత, పునరావాసము మరియు పునఃస్థాపన చట్టం 2013లోని విభాగము 19(1) (కేంద్ర చట్టం 30/2013) ప్రకారము జిల్లా కలెక్టర్, తిరుపతి వారు ఇందుమూలముగా ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా : తిరుపతి మండలము : దక్కిలి గ్రామము : మాధవాయపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ సబ్ డివిజన్ నెంబరు	మొత్తం విస్తీర్ణం ఎ. సెం	భూసేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెం.	భూ స్థితి	సంబంధిత ఆసామి పేరు, పట్టాదారు పేరు మరియు అనుభవదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల, వివరములు
1.	92-6 (సర్వే నెం.92-1 నుండి విభజించబడినది	1.64	0.74	మెట్ట	ఒరేపల్లి అంకిరెడ్డి తండ్రి రామవరెడ్డి	1	92-2	92-4	1	బోర్-1, డ్రిప్ సిస్టం మామిడి-4 (చిన్నవి) సపోటా-2 (చిన్నవి), టేకు-3 (పెద్దవి), 02 (చిన్నవి), నిమ్మ -38 (పెద్దవి), 45 (చిన్నవి), వేప 05 (పెద్దవి), 03 (చిన్నవి)
2.	92-4	3.39	1.33	మెట్ట	ఒరేపల్లి నిర్మలమ్మ భర్త రమణారెడ్డి	92 -1	92 -3	92 -5	92 -1	బోర్-1, డ్రిప్ సిస్టం సిమెంటు ఇటుకలుతో గల రేకుల రూము-01, నిమ్మ-71 (పెద్దవి), 26 (చిన్నవి), వేప -35 (పెద్దవి), 08 (చిన్నవి టేకు-03 (పెద్దవి), 04 (చిన్నవి), అరటి-22, బొప్పాయి-04
	మొత్తం	2.07								

పై భూముల మొక్క వివరములు భూసేకరణ కార్యాలయము, APIIC, తిరుపతి నందు అందుబాటులో ఉంచబడును. ఆసక్తి కలిగిన వ్యక్తులు కార్యాలయ పని వేళలలో హాజరై పరిశీలన చేసుకొనగలరు. ఈ భూసేకరణలో స్థానభ్రంశమునకు గురి అయిన కుటుంబాలు ఏవియును లేవని తెలుపడమైనది.

భూసేకరణ కారణంగా పునరావాసం మరియు పునరావాసం పొందే అవకాశం ఉన్న కుటుంబాల సంఖ్య ఏమి లేవు. వీరి కోసం పునరావాస ప్రాంతం గుర్తించబడింది. పునరావాస ప్రాంతం వివరాలు ఇలా ఉన్నాయి.

వరుస నెంబర్	గ్రామము పేరు	మండలము పేరు	జిల్లా పేరు	మొత్తం విస్తీర్ణం
- లేవు -				

పునరావాసం మరియు పునరావాస పథకం యొక్క సారాంశం జోడించబడినది.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే ఉపయోగించవలెను.

సం/- శ్రీ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, ఐ.ఏ.యస్ , జిల్లా కలెక్టరు, తిరుపతిజిల్లా



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి

జూడాల సమ్మె విరమణ

● సుప్రీంకోర్టు, ప్రభుత్వ హామీతో శాంతి



ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న జూడాలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 23 : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఈ నెల 15 నుంచి జూనియర్ వైద్యుల సంఘం నెల్లూరులో చేపడుతున్న సమ్మె, నిరసన దీక్షలను శుక్రవారం విరమించింది. నిందితులను కఠినంగా శిక్షించేలా సుప్రీంకోర్టు సీబీఐకి కేసును అప్పగించటం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ కేసులపై సీరియస్‌గా ప్రకటన చేయటంతో జూనియర్ డాక్టర్లు శాంతించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరా దేవి జూడాల దీక్ష శిబిరానికి చేరుకుని నిరసనను విరమించాలని కోరారు. కోల్‌కతా ఘటన యావద్దేశాన్ని కలిచి వేస్తోందని, దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు. డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ మునీర్ ఖన్నా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళావతి, డాక్టర్ గీతాలక్ష్మి, ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీరస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల భద్రతకు ఏర్పాట్ల పరిశీలన

కోల్‌కతా ఘటన నేపథ్యంలో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యాధికారులు స్పందించారు. జీజీహెచ్‌లో విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించటంతో పాటు వారికి కావాల్సిన అన్ని వసతులను పరిశీలించారు. వైద్యులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదితో పాటు రెస్ట్‌రూమ్, ప్రత్యేక బాత్‌రూమ్‌ల ఏర్పాటును పరిశీలించారు. మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించేందుకు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్ బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి పాల్గొన్నారు. కాగా, 'కోల్‌కతా' ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతూ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్‌కు ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్ వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ హామీతో తాము నిరసన దీక్షను విరమిస్తున్నామని, యథావిధిగా వైద్య సేవలు కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులకు హై సెక్యూరిటీ భద్రత కల్పిస్తామని డాక్టర్ గంగాధర్ హామీ ఇచ్చారు.

జైల్ సూపరింటెండెంట్ బదిలీ

నెల్లూరు(క్రైం): జిల్లాలోని వెంకటాచలం మండలం చెముడుగుంటలో గల జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కే రాజేశ్వరరావు కడప సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరులోని ఏపీస్టార్స్ ప్రిన్సిపాల్ ఎస్ రాజారావును ప్రభుత్వం నియమించింది. కడప సెంట్రల్ జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఐఎస్‌హెచ్ ప్రకాష్‌ను నెల్లూరులోని ఏపీ స్టార్స్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ జైళ్లశాఖ డీఐజీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రశాంతినగర్‌లో మృతదేహం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 23: నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో గల ప్రశాంతినగర్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. చంద్రయ్య అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించా రు. మృతదేహంపై బులుగు రంగు గళ్ల లుంగి, నలుపు, బులుగు రంగు గళ్ళ చొక్కా ఉన్నాయి. కుడివైపు పక్కటెముకలపై పుట్టుమచ్చ, పొట్టపై నల్లని పుట్టు మచ్చలు ఉన్నాయి. మృతుని ఆచూకీ తెలిచిన వారు నవాబుపేట పోలీసు స్టేషన్‌కుగానీ, 9440796306, 9440796310 నెంబర్లకుగానీ సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా చూడాలి

● జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ



నీటిని పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని వెంగళరావునగర్, తాతయ్యబడి, ఎన్‌టీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను గుర్తించి ఆ నీటిని ఒలకబోశారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రీనా భారతి, సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, శాంసన్‌బాబు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

26 నుంచి వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 : నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి గ్రామంలోని భగవాన్ వెంకయ్య స్వామి గురునిలయంలో ఈ నెల 26 నుంచి ఆరాధన వేడుకలు జరుగుతాయని భక్త బృందం ఓ ప్రకటనలో తెలిపింది. 26వతేదీ ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, పూజలు, హోమం, సహస్ర నామార్చన, భజన అనంతరం అన్నదానం జరుగుతాయని పేర్కొంది. సాయంత్రం అఖండనామ సంకీర్తనం, రాత్రి నగరోత్సవం జరుగుతాయని తెలిపింది. 27వతేదీ కూడా అభిషేకం, భజన సంకీర్తన, అన్నదానం, అఖండ నామ సంకీర్తన, నగరోత్సవం జరుగుతా యని భక్తులందరూ తరలిరావాలని కోరింది.

డీవైఎఫ్ఐ కంటి వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 23 : నగరంలోని ఆదిత్యానగర్‌లో ఉన్న బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాసన్ ఐ కేర్ సెంటర్ వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ నేత రాజేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడటమే కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలను కూడా తమ సంఘం చేపడుతుందని చెప్పారు.